తెలుగు దినపత్రిక
https://aksharagalam.com
# అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం

పేజీలు: 8 | వెల: 3 | సంపుటి:3 | సంచిక: 234

శుక్రవారం 30, జనవరి 2026

॥ ఎడిటర్: దయాకర్ రెడ్డి ॥

## త్వరలో గాలి నాణ్యత డాష్ బోర్డులను ప్రారంభిస్తాం..

- పరిశుభ్రమైన గాలితోనే నిజమైన అభివృద్ధి
- తెలంగాణ ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యంతో శాస్త్రీయ విధానాన్ని అనుసరిస్తుంది
- నివాస ప్రాంతాల్లోని పరిశ్రమలతో భద్రత, ఆరోగ్య ప్రమాదాలు
- గాలి నాణ్యత పర్యవేక్షణకు రాష్ట్రంలో 40 కొత్త స్టేషన్లను ఏర్పాటు చేశాం
- కాలుష్య ఫిర్యాదులపై వేగంగా స్పందించేందుకు ప్రత్యేక బృందాలు
- గాలి నాణ్యత సూచీ- గాలి నాణ్యత నిర్వహణపై సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

6లో



# కేసీఆర్.. విచారణకు రండి!

- నేడు విచారణకు రావాలని సిట్ నోటీసు
- విచారణ ఎక్కడయినా ఓకే
- కేసీఆర్ నివాసంలోనే విచారణ
- 'సిట్'కే రావలసిన పనిలేదు
- ఫోన్‌ట్యాపింగ్ కేసులో కొత్త మలుపు
- బీఆర్ఎస్‌లో ఉత్కంఠ



**హైదరాబాద్,(అక్షర గళం):** తెలంగాణ రాజకీ యాల్లో కలకలం రేపుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు కొత్త మలుపు తిరిగింది. బీఆర్ఎస్ అగ్రనేతలయిన హరీష్, కేటీఆర్, సంతోష్ తర్వాత పార్టీ అధినేత కేసీఆర్ వంతు వచ్చింది. ఆయనను విచారణకు హాజరుకావలసిందిగా సిట్ అధికారులు, నందినగర్‌లోని కేసీఆర్ నివాసంలో నోటీసు అందించారు.

సెక్షన్ సీఆర్‌పీసీ 160 కింద కేసీఆర్‌కు నోటీసు ఇచ్చారు. నిబంధనల ప్రకారం కేసీఆర్‌ను ఆయన నివాసంలోనే విచారిస్తామని, శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు వస్తామని సిట్ అధికారులు సమాచారం ఇచ్చారు. ఆ సమయంలో కేసీఆర్ నివాసంలో లేరు.

కాగా కేసీఆర్‌ను ఆయన నివాసంలోనే విచారించనున్న నేపథ్యంలో పోలీసులు భద్రతా ఏర్పాట్లపై దృష్టి సారించారు. మీడియాతోపాటు, పార్టీ కార్యకర్తల తాకిడి వచ్చే అవకాశం ఉన్నందున.. వారిని నియంత్రించే ప్రక్రియపై పోలీసులు ముందస్తు చర్యలు ప్రారంభించారు.

### వ్యూహాత్మకంగానే..

టెలిఫోన్ ట్యాపింగ్ కేసును ఏడాది నుంచి సాగదీస్తున్న రేవంత్ సర్కారు.. ఈ కేసులో బీఆర్ఎస్ నేతలను వ్యూహాత్మకంగానే విచారణకు పిలిపిస్తున్నట్లు కనిపిస్తోంది. పార్టీ అగ్ర నాయకులయిన కేటీఆర్, హరీష్‌రావు, సంతోష్‌రావును విచారించిన సిట్.. చివరిగా ఆ పార్టీ అధినేత కేసీఆర్‌ను పిలవడం కూడా వ్యూహాత్మకమేనంటున్నారు. పార్టీ అధినేతనే విచారించడం వల్ల కార్యకర్తలు- నేతల ఆత్మస్థైర్యం దెబ్బతింటుందన్నది రేవంత్ సర్కారు భావనగా కనిపిస్తోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఒక మాజీ సీఎంను, సిట్ విచారణకు పిలవడం ఇదే ప్రథమం. అయితే ఆయనను సాక్షిగా పిలిస్తున్నారా? నిందితుడిగా పిలుస్తున్నారా అన్న దానిపై స్పష్టత లేదు.

### ఈరోజు విచారణకు
# రాలేను!

- మున్సిపల్ ఎన్నికల్లో బిజీగా ఉన్నా
- ఆ తర్వాత విచారించండి
- నా ఫాంహౌస్‌కి రండి
- సిట్‌కు కేసీఆర్ లేఖ

2లో

## మేడారం జాతర గిరిజనుల
# మహా కుంభమేళా

- దేశంలోనే అతి పెద్ద గిరజనుల పండగ
- కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం
- కిషన్‌రెడ్డితో కలసి గద్దెల వద్ద మంత్రుల ప్రత్యేక పూజలు

**మేడారం,జనవరి 29(అక్షర గళం):**
మేడారం సమ్మక్క-సారక్క జాతర సందర్భంగా కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ప్రత్యేకంగా గద్దెలను దర్శించుకుని మొక్కులు సమర్పించారు. సందర్భంగా రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దనసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆలయ ప్రధాన ద్వారం వద్ద కేంద్ర మంత్రులకు ఘన స్వాగతం



పలికారు. గిరిజన సంప్రదాయ డోలు,డప్పుల నడుమ ఆలయంలోకి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తల్లులకు నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించారు. తదనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం మాట్లాడుతూ, సమ్మక్కసారక్క జాతర దేశంలోనే అతిపెద్ద గిరిజన పండుగ. ఇది గిరిజనుల మహాకుంభంగా నిలుస్తోంది. సుమారు 20 ఏళ్ల క్రితం నేను ఇక్కడికి వచ్చాను. ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు మళ్లీ ఈ పవిత్ర జాతరకు రావడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో నిధులు అందిస్తోందని తెలిపారు. జాతర నిర్వహణకు సహకరిస్తూనే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనకు పాత మిత్రులని, పార్లమెంటులో కలిసి పనిచేసిన అనుభవం ఉందని గుర్తు చేశారు. గిరిజన సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ధర్తీ ఆబా గిరిజన గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కింద 1 లక్ష కోట్లు పీఎం జన్-మన్ యోజన కింద 24,000 కోట్లు, తెలంగాణకు 23 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరు చేయడం



జరిగిందన్నారు. అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో గిరిజన వ్యవహారాల ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటై, తొలి క్యాబినెట్ మంత్రిగా తాను బాధ్యతలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. భగవాన్ బిర్సా ముండా వంటి గిరిజన వీరుల త్యాగాలను దేశం గౌరవిస్తోందని అన్నారు.

ఈ సందర్భంగా కేంద్ర మిగతా.. 2లో

## మేడారం జాతరను జాతీయపండుగగా గుర్తించాలి


- కేంద్రానికి విజ్ఞప్తి చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**మేడారం,జనవరి 29(అక్షర గళం):** తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్వహిస్తున్న రెండోసారి సమ్మక్క-సారక్క జాతర ఇదేనని, ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ జాతరను మిగతా.. 2లో



## అంతరాయం లేకుండా
# రాష్ట్రంలో విద్యుత్ సరఫరా

- రాజస్థాన్, గుజరాత్ విధానాలు అధ్యయనం చేయాలి
- పునరుత్పాదక ఇంధన రంగాల పనులు వేగవంతం చేయాలి
- ఉస్మానియా తదితర ఆస్తులు నిర్మాణం వేగంగా సాగాలి
- అధికారులతో సమీక్షలో సిఎస్ రామకృష్ణారావు సూచన



**హైదరాబాద్,జనవరి 29(అక్షర గళం):**
రాష్ట్రంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. అలాగే, పునరుత్పాదక ఇంధన రంగంలో చేపడుతున్న కార్యక్రమాలను వేగవంతం చేయాలని, ప్రాజెక్టుల అమలులో నిర్ణీత కాలపరిమితులను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇంధన, వైద్య ఆరోగ్య, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, పరిశ్రమలు, మైన్స్, టీజీఐఐసి, భారత ఫ్యూచర్ సిటీ, ఇరిగేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, మూసీ సుందరీకరణ, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ తదితర శాఖల పనితీరుపై విభాగాల వారీగా గురువారం డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, టిజి ట్రాన్స్‌కో, టిజి జెన్‌కో, టిజి ఎస్‌పిడిసిఎల్, టిజి ఎన్‌పిడిసిఎల్ విభాగాలలో కొనసాగుతున్న ప్రతిపాదిత ప్రాజెక్టుల పురోగతి, అలాగే భవిష్యత్ అవసరాలకు మిగతా.. 2లో



## మామునూరు ఎయిర్‌పోర్టుకు భూమి అప్పగింత చరిత్రాత్మక ఘట్టం

- అదిలాబాద్, కొత్తగూడెం ఎయిర్‌పోర్టుల పనులు వేగవంతం చేయాలి
- బేగంపేట సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, (అక్షర గళం):**
మామునూరు ఎయిర్‌పోర్టుకు అవసరమైన భూమిని కేంద్ర విమానయాన శాఖకు అప్పగించడం రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయే రోజు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. వరంగల్ జిల్లా మామునూరులో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవసరమైన 300 ఎకరాల భూమిని కేంద్ర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడుకు అధికారికంగా అప్పగించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గురువారం బేగంపేట విమానాశ్రయంలో జరిగిన సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం ఏర్పడగానే మామునూరు ఎయిర్‌పోర్టు కోసం భూసేకరణను పూర్తి చేసి కేంద్రానికి అప్పగించడం గర్వకారణమన్నారు. మామునూరు తరహాలోనే అదిలాబాద్, కొత్తగూడెం పట్టణాల్లో ఏర్పాటు చేయనున్న ఎయిర్‌పోర్టుల నిర్మాణ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర మంత్రిని కోరినట్లు తెలిపారు.


తెలుగు గడ్డపై పుట్టిన వ్యక్తి కేంద్రంలో విమానయాన శాఖ మంత్రిగా మిగతా.. 2లో

## రైతుల నోట్లో మట్టి కొట్టి.. బీరు ఫ్యాక్టరీలకు నీళ్లిస్తారా?

- కాంగ్రెస్ పాలనలో రైతులకు భరోసా లేదు..
- పెట్టుబడి సాయానికి దిక్కులేదు..
- బ్రేకులు లేని బస్సులా కాంగ్రెస్ పాలన.. వెంటనే రైతు బంధు, బోనస్, పంట నష్టం డబ్బులు విడుదల చేయాలి..
- మాజీ మంత్రి హరీష్ రావు

**సిద్దిపేట, (అక్షర గళం):** రాష్ట్రంలో రైతుల పరిస్థితి చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది. రైతుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరును నేను తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు. ఈరోజు సిద్దిపేట మార్కెట్ యార్డులో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

కేంద్రప్రభుత్వం కందులకు రూ.8,000 మద్దతు ధర నిర్ణయించింది. దళారులను నమ్మి మోసపోకుండా రైతు సోదరులంతా ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాను. మన దేశంలో నూనె గింజలు, పప్పు దినుసుల కొరత ఉంది. అందుకే రైతులు పంట మార్పిడి విధానాన్ని పాటించి వరికి మిగతా.. 2లో






## ఖర్గే, రాహుల్‌తో
# థరూర్ భేటీ

- కేరళ అసెంబ్లీ ఎన్నికలపై నేతల చర్చ

**న్యూఢిల్లీ,జనవరి 29(అక్షర గళం):**
కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ గురువారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీలతో సమావేశమయ్యారు. బుధవారం పార్లమెంటులో ఖర్గే కార్యాలయంలో కొన్ని గంటలపాటు ఈ సమావేశం జరిగింది. గతవారం కేరళలో జరిగిన కీలక సమావేశానికి థరూర్ హాజరుకాలేదు. దీంతో శశిథరూర్ కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పారని ఊహాగానాలు వినిపించాయి. ఈ తరుణంలో ఖర్గేతో, రాహుల్‌తో శశిథరూర్ సమావేశం జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశం అనంతరం థరూర్ మీడియాతో మాట్లాడుతూ.. ' మా ఇద్దరి నాయకులతో మాట్లాడాను. మా చర్చలు సానుకూలంగా జరిగాయి. మిగతా.. 2లో


## మున్సిపల్ ఫిర్యాదులపై ఈసీ యాప్ ప్రారంభం

**హైదరాబాద్,జనవరి 29 (అక్షర గళం):**
తెలంగాణలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, రాష్ట్ర ఎన్నికల సంఘం మొబైల్ యాప్‌ను ప్రారంభించింది. ఎన్నికలకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే ఫిర్యాదులు చేయడానికి ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ ద్వారా సులభంగా ఫిర్యాదు నమోదు చేయవచ్చు. అలాగే.. వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదులు చేయొచ్చని ఎస్ఈసీ పేర్కొంది. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. మొత్తం 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు అధికారులు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 11వ తేదిన పోలింగ్ జరగనుంది, ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.




## మోమో గోదాం ప్రమాదంలో 21కి చేరిన మృతుల సంఖ్య

- మరో 28 మంది ఆచూకీ తెలియకుండా పోవడంతో ఆందోళన



**కోల్‌కతా (అక్షర గళం):**
కోల్‌కతా దక్షిణ 24 పరగణాల జిల్లాలోని మోమో ఆహార పదార్థాల గోదాంలో సోమవారం అగ్నిప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 21కి చేరుకుంది. మరో 28 మంది ఆచూకీ తెలియాల్సి ఉంది. దీంతో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. అక్కడి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, అలాగే రాజకీయ నాయకుల పర్యటన నేపథ్యంలో.. బుధవారం అర్ధరాత్రి నుంచి ఆ ప్రాంతంలో నిషేధాజ్ఞలు విధించామని పోలీసులు తెలిపారు.
జనవరి 26(సోమవారం) గణతంత్ర దినోత్సవం వేళ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర రాజధాని కోల్‌కతాలో జరిగిన భారీ అగ్నిప్రమాదం ఘోర విషాదాన్ని మిగిల్చింది. సోమవారం ఉదయం 3 గంటలకు ఆనంద్‌పూర్ ప్రాంతంలోని రెండు ఆహార గోదాంలలో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న వెంటనే అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది.. మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించారు. అయితే గోదాం లోపల పొడి ఆహార మిగతా.. 2లో

## ఖర్గే, రాహుల్‌తో
# థరూర్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

అంతా బాగానే ఉంది. మేము కలిసి నడుస్తాము. ఇంకేం చెప్పగలను. నేను ఎప్పుడూ పార్టీ కోసం ప్రచారం చేశాను. నేను వ్యక్తిగతంగా ఎక్కడా ప్రచారం చేయలేదు' అని అన్నారు. మీరు ఎన్నికల్లో పోటీ చేస్తారా? సిఎం పదవి గురించి ఈ సమావేశంలో చర్చించారా అని మీడియా అడిగిన ప్రశ్నకు.. 'ఈ విషయంపై మేము మాట్లాడుకోలేదు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థిగా పోటీ చేయడానికి నాకు ఇష్టం లేదు. ప్రస్తుతానికి నేను ఎంపిని. తిరువనంతపురం నుండి నా ఓటర్ల విశ్వాసం నాకు ఉంది. పార్లమెంటులో వారి ప్రయోజనాలను నేను చూసుకోవాలి. అది నా పని' అని ఆయన అన్నారు. ఈరోజు ఖర్గేతో, రాహుల్‌గాంధీతో చర్చలు సజావుగా సాగినందుకు వారికి శశిథరూర్ కృతజ్ఞతలు తెలిపారు.

## మోమో గోదాం ప్రమాదంలో 21కి చేరిన మృతుల సంఖ్య

(మొదటి పేజీ తరువాయి)

పదార్థాలతో పాటూ మండే వస్తువులు అధికంగా ఉండడంతో మంటలు వేగంగా వ్యాపించాయి. గంటల తరబడ్గి ÷ర్ సిబ్బంది ప్రయత్నం చేసినా మంటలు అదుపులోకి రాలేదు. చాలా సమయం తర్వాత అగ్నిమాపక సిబ్బంది అందులో చిక్కుకున్న వారి కోసం గాలింపులు చేపట్టగా తొలి రోజు 16 మంది మృతదేహాలు లభ్యమయ్యాయి. తాజాగా గురువారం మరో ఐదు మృతదేహాలను గుర్తించారు. దీంతో మృతుల సంఖ్య 21కి చేరింది. మిగతా వారి కోసం గాలింపు చేపడుతున్నారు. అయితే మృతదేహాలను గుర్తించడం కష్టంగా ఉన్నందున.. డీఎన్ఏ ఆధారంగా మృతదేహాల గుర్తింపు చేపడుతున్నామని అధికారులు చెబుతున్నారు. ఇక ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు మోమో కంపెనీ రూ. 10 లక్షల పరిహారం ప్రకటించింది. అంతేకాకుండా వారి కుటుంబాలకు ప్రతి నెలా ఆర్థిక సహాయం, వారి పిల్లల చదువు బాధ్యతలు భరిస్తామని వెల్లడించింది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది.

## మేడారం జాతర గిరిజనుల
# మహా కుంభమేళా

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ఈ జాతర గిరిజన ప్రజల అతిపెద్ద పండుగ. నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది భక్తులు ఇక్కడికి వస్తారని తెలిపారు. జాతర ఏర్పాట్లలో భాగస్వాములైన రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఈ ప్రాంత అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు



తెలిపారు. ములుగు, లక్నవరం, మేడవరం, తాడ్వాయి, బొగత జలపాతం ప్రాంతాల పర్యాటక అభివృద్ధికి 80 కోట్లు, రామప్ప దేవాలయ అభివృద్ధికి 140 కోట్లు, ఈ ఏడాది జాతర నిర్వహణకు 3.70 కోట్లు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. సమ్మక్క-సారక్క పేరుతో 890 కోట్లతో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు కానుందని, పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. త్వరలో ప్రధాని చేతుల మీదుగా ప్రారంభించు కుంటామని వెల్లడించారు. లక్షలాది మంది వచ్చే ఈ మహాజాతరలో భక్తులకు కనీస వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని అభినందిస్తూ, అంకితభావంతో పనిచేస్తున్న అధికారులు, మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.



## మామునూరు ఎయిర్‌పోర్టుకు
# భూమి అప్పగింత చరిత్రాత్మక ఘట్టం

మొదటి పేజీ తరువాయి..

ఉండడం సంతోషకరమని, తెలంగాణ రాష్ట్ర అవసరాలను గుర్తించి సహకారం అందించాలని కోరారు. 2007లోనే ఎయిర్‌పోర్ట్ అథారిటీతో ఒప్పందం జరిగినప్పటికీ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా మామునూరు ఎయిర్‌పోర్టు ఆలస్యమైందని విమర్శించారు. హైదరాబాద్‌కు మాత్రమే కాకుండా రాష్ట్రంలోని రెండో శ్రేణి నగరాలైన అదిలాబాద్, కొత్తగూడెంలో కూడా ఎయిర్‌పోర్టులు అవసరమని రాష్ట్ర క్యాబినెట్ మొత్తం కేంద్ర మంత్రిని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించడం శు భసూచకమన్నారు. మామునూరు ఎయిర్‌పోర్టు నిజాం కాలంలోనే, 1930లో ప్రారంభమై దక్షిణ భారతదేశంలోనే ఒకప్పుడు అతిపెద్ద ఎయిర్‌పోర్టుగా గుర్తింపు పొందిందని చెప్పారు. భూసేకరణకు అవసరమైన 300 కోట్ల రూపాయలను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి వేగంగా ప్రక్రియ పూర్తి చేసిందని డిప్యూటీ సీఎం తెలిపారు.



# ఈరోజు విచారణకు రాలేను!

- మున్సిపల్ ఎన్నికల్లో బిజీగా ఉన్నా
- ఆ తర్వాత విచారించండి
- నా ఫాంహౌస్‌కి రండి
- సిట్‌కు కేసీఆర్ లేఖ

హైదరాబాద్,(అక్షరగళం):

ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ జారీ చేసిన నోటీసులపై బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ లిఖితపూర్వకంగా స్పందించారు. ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్న నేప థ్యంలో తాను పూర్తిగా బిజీగా ఉన్నానని, ఈ కారణంగా సిట్ ముందు హాజరు కావడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం విచారణకు హాజరవుతానని, అందుకు అనుగుణంగా మరో తేదీని ఖరారు చేయాలని ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌ను కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. అలాగే, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 160ను ప్రస్తావించిన కేసీఆర్, 65 ఏళ్లు దాటిన వ్యక్తులను పోలీస్ స్టేషన్‌కు పిలవకూడదని చట్టంలో స్పష్టంగా ఉందని గుర్తు చేశారు. ఈ నిబంధన ప్రకారం తన నివాసంలోనే విచారణ జరపాలని కోరారు. తాను సిద్దిపేట జిల్లా, మార్కుక్ మండలం, ఎరవల్లి గ్రామంలో నివసిస్తున్నట్లు పేర్కొన్న కేసీఆర్, విచారణ కోసం అధికారులు అక్కడికే రావాలని సిట్‌కు సూచించారు. అలాగే భవిష్యత్తులో జారీ చేసే అన్ని నోటీసులను తన నివాస చిరునామాకే



పంపాలని కూడా విజ్ఞప్తి చేశారు. ఎన్నికల వేళ సిట్ నోటీసులు, వాటిపై కేసీఆర్ ప్రతిస్పందన రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ వ్యవహారంలో సిట్ తదుపరి అడుగులు ఏమిటన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

## మేడారం జాతరను జాతీయపండుగగా గుర్తించాలి

(మొదటి పేజీ తరువాయి)

అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని భక్తుల సౌకర్యార్థం అనేక శాశ్వత అభివృద్ధి పనులను చేపట్టిందని రాష్ట్ర మంత్రిపొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మేడారంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, సమ్మక్క-సారక్క జాతరను 'జాతీయ పండుగ'గా గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇప్పటికే పలుమార్లు కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రుల పర్యటనతో ఈ అంశం త్వరలోనే సాకారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమ్మక్క-సారక్క జాతరను గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా, మరో కుంభమేళాగా ఆయన అభివర్ణించారు.

ఈ మహాజాతర విజయవంతంగా నిర్వహించేందుకు అంకితభావంతో కృషి చేసిన అధికారులు, సిబ్బంది మరియు సహకరించిన మీడియా మిత్రులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సూచనల మేరకు ఇన్‌ఛార్జ్ మంత్రి పర్యవేక్షణలో కేవలం 90 రోజుల్లోనే ఆలయ అభివృద్ధి పనులు మరియు మౌలిక వసతులు పూర్తి చేసినట్లు తెలిపారు. సాధారణంగా నాలుగు రోజులపాటు జరిగే జాతరను, ఈసారి భక్తుల రద్దీ దృష్ట్యా విస్తృత ఏర్పాట్లతో ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు జాతర ప్రశాంతంగా, సవ్యంగా కొనసాగుతోందని పేర్కొంటూ, జిల్లా కలెక్టర్, ఎస్పీ, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు, ఇతర జిల్లాల నుంచి వచ్చి సేవలందించిన సిబ్బంది మరియు సమాచారాన్ని ప్రజలకు చేరవేసిన మీడియా ప్రతినిధు లకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గద్దెల పునర్నిర్మాణం సహా మౌలిక సదుపాయాల పనులు నిర్ణీత కాలంలో విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు.

# రైతుల నోట్లో మట్టి కొట్టి.. బీరు ఫ్యాక్టరీలకు నీళ్లిస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యామ్నాయంగా సన్‌ఫ్లవర్, ఆయిల్ పామ్, పప్పు దినుసులు సాగు చేస్తే భూసారం పెరుగుతుంది, చీడపీడలు తగ్గుతాయి, అధిక లాభాలు వస్తాయి.ఎరువుల కోసం మళ్లీ చెప్పులు లైన్లో పెట్టే రోజులు వచ్చాయి. బీజేపీ ప్రభుత్వం సబ్సిడీలకు కోత పెట్టాలని ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తోంది. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీలో పూర్తిగా విఫలమైంది. పదేళ్ల కేసీఆర్ గారి పాలనలో ఏనాడూ ఎరువులకు కొరత రాలేదు. కరోనా వచ్చినా, నోట్లు రద్దయినా రైతులకు ఇబ్బంది రాలేదు. కానీ కాంగ్రెస్ వచ్చాక మళ్లీ ఎరువుల కోసం తెల్లవారుజామున 3 గంటలకు వచ్చి క్యూలైన్లలో చెప్పులు పెట్టి నిలబడే చీకటి రోజులను తీసుకువచ్చారు..యూరియా దొరక్క రైతులు ప్రైవేటులో అధిక ధరలకు లిక్విడ్ ఎరువులు కొంటూ నష్టపోతున్నారు. ఫిబ్రవరి వచ్చినా రైతు బంధు జాడ లేదు.

యాసంగి సాగు పనులు సాగుతున్నాయి. దుక్కి దున్ని, నాట్లు వేసి, కలుపు తీసి ఎరువులు వేసే సమయం ఇది. కేసీఆర్ ఉన్నప్పుడు డిసెంబర్‌లోనే రైతు బంధు టింగు టింగుమని ఫోన్లలో మోగేది. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి దిశానిర్దేశం లేదు..రైతు భరోసా ఎప్పుడు ఇస్తారు? ఎంత ఇస్తారు? 15 వేలా? 12 వేలా? ఎన్ని ఎకరాలకు ఇస్తారు? అనే దానిపై స్పష్టత లేదు.

రైతులు వడ్డీలకు తెచ్చి పెట్టుబడి పెడుతున్నారు. ఆ మిత్తీల భారం రైతుల మీదే పడుతోంది. రైతులకు నీళ్లు బంద్.. బీరు ఫ్యాక్టరీలకు నీళ్లు మాత్రం ఫుల్. ఇవాళ మెదక్ జిల్లాలో రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. సింగూర్ ప్రాజెక్టు కింద 40 వేల ఎకరాలు, గణపురం ప్రాజెక్టు కింద 30 వేల ఎకరాలు.. మొత్తం 70 వేల ఎకరాలకు క్రాప్ హాలిడే ప్రకటించారు. కారణం అడిగితే రిపేర్లు ఉన్నాయి, నీళ్లు లేవు అంటున్నారు. రైతులకు ఇవ్వడానికి లేని నీళ్ల బీరు ఫ్యాక్టరీలకు ఎక్కడి నుంచి వస్తున్నాయి?

ఎక్సైజ్ శాఖ కార్యదర్శి స్వయంగా వచ్చి బీరు ఫ్యాక్టరీలకు నీళ్లు ఆపొద్దు, ఫుల్‌గా ఇవ్వండి అని ఆదేశాలు ఇస్తున్నారు.

మీకు రైతుల కంటే బీరు ఫ్యాక్టరీల ఓనర్లు ఇచ్చే లంచాలు, కమిషన్లే ముఖ్యమా? రైతులు లంచాలు ఇవ్వరని వారి పంటలను ఎండబెడతారా? కేసీఆర్ పాలనలో ఎప్పుడూ క్రాప్ హాలిడే లేదు. మీకు బీరు ఫ్యాక్టరీల మీద ఉన్న ప్రేమరైతుల మీద లేదు..హెలికాప్టర్లో వచ్చి హామీలిచ్చారు.. పైసా విడుదల చేయలేదు..పోయిన వానాకాలంలో వడగండ్ల వాన వల్ల పంట నష్టపోతే, ముఖ్యమంత్రి హెలికాప్టర్లో వచ్చి ఎకరానికి 10 వేలు ఇస్తామని చెప్పారు. ఏడాది గడిచింది.. ఇప్పటికీ ఒక్క పైసా ఇవ్వలేదు. మొన్నటి తుఫాను నష్టానికీ పరిహారం లేదు.

బోనస్ పైసలు సగం మందికే ఇచ్చారు, మిగతా వారికి దిక్కులేదు. పోయిన యాసంగి బోనస్ 1100 కోట్లు పెండింగ్ ఉంది. సివిల్ సప్లయ్ మంత్రికి, వ్యవసాయ మంత్రికి, ఆర్థిక మంత్రికి, చివరికి ముఖ్యమంత్రికి కూడా రైతుల గోడు పట్టడం లేదు..మీకు ప్రతిపక్షాలపై కేసులు పెట్టడం, సిట్ నోటీసులు ఇవ్వడం మీద ఉన్న శ్రద్ధ రైతుల మీద లేదు. తక్షణమే రాజకీయ కక్ష సాధింపులు పక్కన పెట్టి.. పెండింగ్‌లో ఉన్న రైతు బంధు నిధులను వెంటనే విడుదల చేయాలి..వానాకాలం, యాసంగికి సంబంధించిన పెండింగ్ బోనస్ డబ్బులు చెల్లించాలి. వడగండ్ల వాన, అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు పరిహారం వెంటనే అందించాలి.. ఎరువుల కొరత లేకుండా చూడాలి. లేదంటే రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున పోరాటం చేస్తుందని హెచ్చరిస్తున్నాను... అని హరీష్ రావు పేర్కొన్నారు.

# అంతరాయం లేకుండా రాష్ట్రంలో విద్యుత్ సరఫరా

(మొదటి పేజీ తరువాయి)

అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లో విద్యుత్ రంగంలో అమలవుతున్న విధానాన్ని పరిశీలించి మన రాష్ట్రంలో కూడా వివిధ డిస్కంలలో అమలు చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు చేపట్టిన పనుల పురోగతిపై సి.ఎస్ కు వివరించారు. ఇ-గవర్నెన్స్, తదితర అంశాలు, అండర్ గ్రౌండ్ కేబులింగ్, విజన్ 2047 లక్ష్యాలు, గ్రేటర్ హైదరాబాద్ భవిష్యత్ విద్యుత్ అవసరాల మేరకు ప్రతిపాదించిన చంద్రవెల్లి, రాయదుర్గం, షాద్ నగర్, పరిగి లో విద్యుత్ సబ్ స్టేషన్ల పనుల పురోగతి పై సి.ఎస్ సమీక్షించారు. ÷ూష్ట్రంలో వరంగల్, ఆల్వాల్, సనత్ నగర్, ఎల్.బి.నగర్, న్యూ ఉస్మానియా, నిమ్స్ ఆసుపత్రి విస్తరణ పలు ప్రాంతాలలో నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రుల భవనాల పురోగతి, ప్రజలకు అందుతున్న వైద్య సేవల నాణ్యత, వైద్య సదుపాయాల లభ్యత, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రభుత్వ ఆసుపత్రులలో మందుల సరఫరా, వైద్య శాఖలో నర్సింగ్, వైద్యుల నియమకాలు, ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన ఇహెచ్ఎస్ పథకం, వైద్య పరికరాల సరఫరా తదితర అంశాలపై సి.ఎస్ సమీక్షించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సి.ఎస్ ఆదేశించారు. ముఖ్యంగా గ్రామీణ, దూర ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు సమర్థవంతంగా అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఆరోగ్య కార్యక్రమాలు, పథకాల అమలుపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్న సి.ఎస్, లక్ష్యాల సాధనలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. మాతా?శిశు ఆరోగ్యం, సంక్రమణ రోగాల నియంత్రణ, సీజనల్ వ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే ఆసుపత్రుల్లో పరిశుభ్రత, రోగులకు సౌకర్యాలు మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జి.హెచ్.యం.సి పరిధిలో చేపట్టిన ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం, ఆల్వాల్, సనత్ నగర్, ఎల్.బి.నగర్, వరంగల్ ఆసుపత్రుల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని సి.ఎస్ అధికారులను ఆదేశించారు. నూతన ఆసుపత్రుల అవసరాలకు మేరకు తగినట్లు అధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకోవాలని, ఇందుకు సంబంధించి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అధునాతన పరికరాల ఏర్పాటుకు తగినట్లు గదులు, ల్యాబ్‌లు, ఇతర నిర్మాణాలు ఉండాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఐటీఈ / సీ శాఖలో ప్రస్తుత కార్యకలాపాలు, కొనసాగుతున్న ప్రాజెక్టులు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై అధికారులు సి.ఎస్ కు వివరించారు. ముఖ్యంగా డిజిటల్ గవర్నెన్స్, ఐటీ పెట్టుబడుల ఆకర్షణ, స్టార్టప్ ఎకోసిస్టం అభివృద్ధి, ఈ-గవర్నెన్స్ సేవల విస్తరణ, సైబర్ సెక్యూరిటీ, రాష్ట్రంలో ఉన్న 12,751 గ్రామ పంచాయతీలలో టి్గ ÷బైర్ విస్తరణ పై సమీక్ష చేశారు.

రాష్ట్రాన్ని ఐటీ రంగంలో మరింత పోటీగా నిలిపే దిశగా స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించడం, యువతకు ఉపాధి అవకాశాలు పెంచేలా ఐటీ రంగంలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వ సేవలను సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా అందించే దిశగా చర్యలు తీసుకోవాలని, వివిధ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఐటీ సేవలను ప్రజలకు సులబతరంగా అందించేందుకు ఒక చితజీబిబం÷ఔ రూపొందించాలని, మీసేవ కేంద్రాలు ప్రజలకు మరింత అందుబాటులో ఉండేందుకు తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో వీలైనంత మేరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో టి్గ÷బైర్ విస్తరణకు తగు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. మైన్స్ శాఖలో ఇసుక సరఫరా పై సాండ్ రీచ్ లలో ఏర్పాటు చేసిన సి.సి.టివీల ఏర్పాటు, ఇటీవల కాలంలో చేపట్టిన సంస్కరణలపై అధికారులు సి.ఎస్ కు వివరించారు. భారత ఫ్యూచర్ సిటీ, టిజి ఐఐసి చేపట్టిన పనుల పురోగతి పై సి.ఎస్ సమీక్షించారు. ఇరిగేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, మూసీ సుందరీకరణ, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ విభాగాలలో చేపట్టిన ప్రాజెక్టులపై సి.ఎస్ సమీక్షించారు. గత మూడు రోజులుగా ఇప్పటి వరకు (13) విభాగాలను ప్రధాన కార్యదర్శి సమీక్షించారు. రాబోయే రెండు రోజులలో మిగతా విభాగాల సమీక్షకు సిద్ధమవుతున్నారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేశ్ రంజన్, సంజయ్ కుమార్, నవీన్ మిట్టల్, మైన్స్ ముఖ్యకార్యదర్శి శ్రీధర్, ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ, హెచ్ యం.డి.ఎ. కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తు, మున్సిపల్ పరిపాలన కార్యదర్శి టి.కె.శ్రీదేవి, టిజి ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్, టిజి ఎస్పిడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ, ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ కమిషనర్ శశాంక, హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్, ఐటి ప్రత్యేక కార్యదర్శి భవేష్ మిశ్రా, టిజి ఎన్.పి.డి.సి.ఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ యం.డి. ఆశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇప్పటికే 80 లక్షల మంది దర్శనం

**రాత్రికి కోటికి మించే అవకాశం**

**శాశ్వత అభివృద్ధికోసం మరో 41 ఎకరాల భూసేకరణ**

**శాశ్వతంగా కాటేజీలు, ఫంక్షన్ హాళ్లు, మౌళిక సదుపాయాలు**

**జంపన్నవాగునిరంతరంగా పారేలా చర్యలు**

**మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,సీతక్కల వెల్లడి**

మేడారం,జనవరి 29(అక్షరగళం):

మేడారం సమ్మక్క-సారక్క మహా జాతరలో భక్తుల తాకిడి గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. మేడారంలో మీడియాతో మాట్లాడిన మంత్రి మాట్లాడుతూ, గురువారం దాదాపు 80 లక్షల మంది భక్తులు దర్శనం చేసుకున్నారని, సమ్మక్క గద్దెపైకి వచ్చే సమయానికి ఈ సంఖ్య కోటికి మించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు మేడారానికి తరలివస్తున్నారని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తోందని మంత్రి స్పష్టం చేశారు. మేడారం జాతర శాశ్వత అభివృద్ధి కోసం ఇప్పటికే 29 ఎకరాల భూమిని సేకరించామని, మరో 41 ఎకరాల భూసేకరణ పక్రియ కొనసాగుతోందని మంత్రి తెలిపారు. మొత్తంగా సుమారు 70 ఎకరాల విస్తీర్ణంలో శాశ్వత మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయను న్నట్లు చెప్పారు. ఈ ప్రాంతంలో శాశ్వతంగా కాటేజీలు, ఫంక్షన్ హాళ్లు, మరిన్ని మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్మించనున్నట్లు వివరించారు. క్షిణ భారత కుంభమేళాగా పేరొందిన మేడారం జాతర ప్రాధాన్యత ను మరింత పెంచేందుకు బాసర నుంచి భద్రాచలం వరకు రూ.2,500 కోట్ల వ్యయంతో టెంపుల్ సర్క్యూట్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి తెలిపారు.

గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రముఖ ఆలయాల అభివృద్ధిలో మేడారం ఆలయాన్ని కూడా భాగంగా చేర్చనున్నట్లు ఆయన ప్రకటించారు. జంపన్న వాగులో ఏడాది పొడవునా నీరు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఇందుకోసం రామప్పలక్నవరం జంపన్న వాగు వరకు పైప్‌లైన్ ద్వారా నీటిని తరలించే ప్రాజెక్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారని, వాగుపై చెక్‌డ్యామ్‌లు నిర్మించి శాశ్వత నీటి నిల్వకు ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. మేడారం ప్రాంతానికి ఇప్పటికే ఒక సమగ్ర మాస్టర్ ప్లాన్ సిద్ధమైందని, దాని




ప్రకారం అంతర్గత రోడ్ల అభివృద్ధి, ఎకో పార్కుల ఏర్పాటు, పర్యాటక సౌకర్యాల విస్తరణ చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. సోషల్ మీడియాలో వస్తున్న దుష్ప్రచారాలను నమ్మవద్దని భక్తులకు మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ, ఈసారి గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ రెండు రోజుల్లోనే 70 నుంచి 80 లక్షల మంది భక్తులు ఇప్పటికే దర్శనం చేసుకున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పంతో, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పర్యవేక్షణలో అత్యంత తక్కువ సమయంలో ఆలయ అభివృద్ధి పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. గతంలో ఇరుకైన రోడ్ల కారణంగా ఇబ్బందులు ఉండేవని, ఈసారి ఫోర్-లేన్ రోడ్లతో రాకపోకలు చాలా సులభమయ్యాయని తెలిపారు. భవిష్యత్తులో శాశ్వత తాగునీటి వ్యవస్థతో పాటు భారీ సంఖ్యలో శాశ్వత మరుగుదొడ్ల నిర్మాణం అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు.

ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విస్తృతంగా చెట్ల పెంపకం చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు.జాతర విజయవంతానికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, ఎస్పీ, అధికార యంత్రాంగం మరియు మీడియా మిత్రులకు సీతక్క అభినందనలు తెలిపారు.నివారం సాయంత్రం 4 గంటలకు తల్లులు గద్దెల నుంచి తిరిగి వనప్రవేశం చేయనున్నారని, అప్పటివరకు భక్తులు ఓపికతో దర్శనాలు చేసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.



తెలుగు దినపత్రిక https://aksharagalam.com
అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం
తెలంగాణ రౌండప్

# మాదిగల వర్కింగ్ కమిటీ అధ్యక్షుడిగా కొప్పు అంజయ్య

**వెల్దండ జనవరి 29 (అక్షరగళం):** వెల్దండ మండల మాదిగల ఐక్యవేదిక కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడిగా అజిలాపూర్ గ్రామానికి చెందిన కొప్పు అంజయ్యను నియమిస్తూ.. మండల ఐక్యవేదిక వ్యవస్థాపక కమిటీ నాయకులు జారీచేసిన ఉత్తర్వులను మాదిగ ఐక్యవేదిక నాయకులు గురువారం కొప్పు అంజయ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక వ్యవస్థాపక కమిటీ నాయకులు కొయ్యల పుల్లయ్య, నక్కర కంటి శ్రీనివాస్, జయ ప్రకాష్, తక్కల్లపల్లి శేఖర్, గుద్దేటి ప్రభాకర్, దార్ల కుమార్, తాండ్ర జంగయ్య, దుబ్బ నాగేష్ లు ఉత్తర్వులను జారీ చేసి అందజేశారు. మరియు కమిటీ సభ్యులు కొమ్ము అంజయ్య, పోలే వెంకటయ్య, ఈదులపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





# యువత వ్యాపార రంగాలలో రాణించాలి

### కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా మనీలా సంజీవ్ కుమార్ యాదవ్

**వెల్దండ జనవరి 29 (అక్షర గళం):** యువత ప్రభుత్వ ఉద్యోగాలపై ఆధారపడకుండా వ్యాపార రంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలను ఆదరోహించాలని కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా



మనీలా సంజీవ్ కుమార్ యాదవ్ అన్నారు. యువత ఒకరిపై ఆధారపడకుండా స్వయం కృషితో ఎదిగిన ప్పుడే దేశం అభివృద్ధిలో పయనిస్తుందని తెలిపారు. ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగాలు రాలేదని నిరాశ చెందకుండా తమలో ఉన్న ప్రతిభను వెలికి తీసి స్వయంకృషితో ఎదగాలని అన్నారు గురువారం వెల్దండ మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామానికి చెందిన జగన్ నూతనంగా ఏర్పాటు చేసిన దర్బార్ స్వీట్ మరియు కే ఎఫ్ కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా మనీలా సంజీవ్ కుమార్ యాదవ్ జక్కుల చిన్న జంగయ్య యాదవ్ ప్రారంభించారు. స్వయంకృషితో వ్యాపారం ప్రారంభించిన సందర్భంగా జగన్ కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా మనీలా సంజీవ్ కుమార్ యాదవ్ జక్కుల చిన్న జంగయ్య యాదవ్ శాలువలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సిలోని బాయ్ తండా సర్పంచ్ లక్ష్మీపతి జక్కుల రామయ్య హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు



# మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**ఆమనగల్లు, జనవరి 29 (అక్షర గళం):** తలకొండపల్లి మండలంలోని దేవునిపడకల్ గ్రామానికి చెందిన పులిజాల బాలమణి బుధవారం సాయంత్రం మృతి చెందారు. విషయం తెలుసుకున్న దేవుని పడకల్ మాజీ సర్పంచ్ కడమోని శ్రీశైలం వారి ఇంటి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. తన వంతు సహాయంగా 3000 వేల రూపాయల ఆర్థిక సహాయం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట పులిజాల కృష్ణయ్య, పులిజాల కుమార్, రావిచేడ్ లక్ష్మయ్య, రావిచేడ్ అంజయ్య, పులిజాల కిష్టయ్య, పులిజాల పర్వతాలు, కోడిగంటి రమేష్, పులిజాల బాలకృష్ణ, మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# వృద్ధురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం.

### అందజేసిన మండల కాంగ్రెస్ నాయకులు తలసాని అనిల్ రెడ్డి

**కల్వకుర్తి, జనవరి 29(అక్షరగళం):** ఊరుకొండ మండలం రాచాలపల్లి గ్రామానికి చెందిన మాదుగుల ఎర్రమ్మ అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని రాచాలపల్లి మాజీ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి ద్వారా విషయాన్ని తెలుసుకున్న మండల కాంగ్రెస్ నాయకులు తలసాని అనిల్ రెడ్డి గురువారం తక్షణ ఆర్థిక సహాయం




కింద మృతురాలి భర్త బక్కయ్యకు స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా 5000/- రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ డైరెక్టర్ వెంకటయ్య భాస్కర్ శంకర్ జంగయ్య నాగయ్య ప్రవీణ్ బాలమ్ మైసయ్య బాల్ చెన్నయ్య ప్రభు మహేష్ పలువురు గ్రామస్తులు పాల్గొని మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.





# మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగరాలి

### - మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

**ఆమనగల్లు, జనవరి 29 (అక్షర గళం):** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ఆమనగల్లులో అత్యధిక వార్డులు గెలుచుకుని బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలని మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం ఆమనగల్లు మున్సిపాలిటీకి చెందిన ప్రముఖ సంఘ సేవకులు, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు పాపిశెట్టి శ్వేత రాము, పాపిశెట్టి కళ్యాణి అరవింద్, వీటాయిపల్లికి చెందిన బీజేపీ నాయకులు మంచుకొండ పద్మ జగదీశ్, మంచుకొండ చంద్రశేఖర్, వీరేశం, మల్లేష్ వారితో పాటు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి 30 మంది నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారిని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఫుడ్ కమిషన్ ఛైర్మెన్ గోలీ శ్రీనివాస్ రెడ్డి, మాజీ గిడ్డంకుల శాఖ ఛైర్మన్, ఆమనగల్లు మున్సిపాలిటీ ఇంచార్జ్ సాయిచంద్ రజిత, మిషన్ భగీరథ మాజీ వైస్ ఛైర్మన్, మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ లు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ లకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. మళ్లీ బీఆర్ఎస్ పార్టీ రావడం ఖాయమన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు అధిక సంఖ్యలో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్, మున్సిపల్ అధ్యక్షుడు పత్యానాయక్, మండల అధ్యక్షుడు అర్జున్ రావు, మాజీ జడ్పీటీసీలు అనురాధ పత్య నాయక్, నిర్మలా శ్రీశైలం, మాజీ ఛైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి, సయ్యద్ ఖలీల్, శంకర్ నాయక్, సురమల్ల సుభాష్, రమేష్ నాయక్, నిరంజన్ గౌడ్, వడ్డేమోని శివకుమార్, నాగిళ్ళ జగన్, గుమ్మకొండ రాజు, వరికుప్పల గణేష్, సైదులు గౌడ్, చంద్రు నాయక్, శ్రీను నాయక్, కిషోర్, వీరయ్య, మహేష్, రమేష్ తదితరులు ఉన్నారు.








# నేటితో ముగియనున్న నామినేషన్ల స్వీకరణ

- **రెండవ రోజు 57మంది నామినేషన్లు దాఖలు..**
- **కాంగ్రెస్ పార్టీ చైర్మన్ అభ్యర్థి రత్నమాల ఆనంద్ కుమార్ తరపున నామినేషన్ దాఖలు చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి.**
- **బిఆర్ఎస్ చైర్మన్ అభ్యర్థి ఎడ్మ రాధిక సత్యానికి బి ఫామ్ అందజేసిన మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి.**

**కల్వకుర్తి, జనవరి 29(అక్షరగళం):** కల్వకుర్తి పురపాలక సంఘం ఎన్నికలకు రెండవ రోజు గురువారం 57 నామినేషన్లు దాఖలు అయ్యాయి. రెండవ రోజు నామినేషన్ల పర్వం కొనసాగింది. నామినేషన్లు భారీగా దాఖలు అయ్యాయి. మొత్తం 57 నామినేషన్లు దాఖలు అయినట్లు మున్సిపల్ కమిషనర్ మొహమ్మద్ షేక్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నుండి 18 మంది కౌన్సిలర్ అభ్యర్థులుగా బిఆర్ఎస్ నుండి 19మంది కౌన్సిలర్ అభ్యర్థులుగా బిజెపి నుండి 9 మంది బీఎస్పీ నుండి ఒకరు సిపిఐ నుండి ఒకరు ఇండిపెండెన్స్ అభ్యర్థులు 9 మంది నామినేషన్లు దాఖలు చేసిన్నట్లు తెలిపారు.

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కాంగ్రెస్ పార్టీ తరపున ఏడవ వార్డు నుండి కౌన్సిలర్ గా పోటీ చేస్తున్న చైర్మన్ అభ్యర్థి బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ తరపున నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ పత్రాన్ని రిటర్నింగ్ ఆఫీసర్ కు దాఖలు చేశారు. అదేవిధంగా 16వ వార్డు నుండి బీఆర్ఎస్ పార్టీ తరపున చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎడ్మ రాధిక సత్యం నామినేషన్ పత్రాన్ని రిటర్నింగ్ అధికారికి దాఖలు చేశారు. 11వ వార్డు సీపీఐ పార్టీ నుండి దార దాసు నామినేషన్ పత్రాన్ని రిటర్నింగ్ అధికారికి దాఖలు చేశారు.





ఇండిపెండెంట్ అభ్యర్థిగా దాచేపల్లి శ్రీనివాసులు నామినేషన్ పత్రాన్ని దాఖలు చేశారు. 11వ వార్డు నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా కనక రాంపర్వతాలు కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్లు దాఖలు చేశారు. ఎనిమిదవ వార్డు నుండి స్వతంత్ర అభ్యర్థిగా కోడెల లలిత గణేష్ యాదవ్ నామినేషన్ దాఖలు చేశారు. 18 వ వార్డు నుండి ఇండిపెండెంట్ అభ్యర్థిగా గౌస్ నాజియా బేగం నామినేషన్ పత్రాన్ని రిటర్నింగ్ అధికారికి దాఖలు చేశారు.








# ఎక్సైజ్ దాడులు అక్రమంగా నల్ల బెల్లం పటిక రవాణా చేస్తున్న బొలెరో వాహనం సీజ్..

### వ్యక్తిపై కేసు నమోదు..

### రిమాండ్‌కు తరలింపు..

**కల్వకుర్తి,జనవరి 29(అక్షరగళం):** హైదరాబాద్ నుండి అక్రమంగా నాటు సారా తయారీ కోసం నల్ల బెల్లం పట్టిక సరఫరా చేస్తున్న ఆమనగల్ మండలం సరికొండ తండాకు చెందిన కాట్రావత్ రమేష్ ను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ వెంకట్ రెడ్డి తెలిపారు. ఎక్సైజ్ అధికారులు తనిఖీ నిర్వహిస్తున్న సందర్భంగా చారగొండ టోల్గేట్ వద్ద నాటు సారాకు సంబంధించి నల్ల బెల్లం పట్టిక అక్రమంగా సరఫరా చేస్తున్న సరికొండ తండాకు చెందిన కాట్రావత్ రమేష్ ను అరెస్టు చేశామని ఎన్ఫోర్స్మెంట్ మహబూబ్నగర్ సీఐ శారద ఎక్సైజ్ దాడుల్లో పాల్గొన్నారని తెలిపారు. బొలెరో వాహనాన్ని అదుపులోకి తీసుకున్నామన్నారు. 110 కేజీల నల్ల బెల్లం 120 కేజీల పట్టిక స్వాధీన పరచుకున్నట్లు ఎక్సైజ్ సీఐ జె వెంకట్ రెడ్డి తెలిపారు.



# జోరుగా రెండవ రోజు నామినేషన్లు

**ఆమనగల్లు, జనవరి 29 (అక్షర గళం):** ఆమనగల్లు మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల పర్వం గురువారం రెండవ రోజు జోరుగా ముగిసింది. మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేయగా 15వార్డులకు గాను నామినేషన్లు దాఖలకు ఐదు కౌంటర్లు ఏర్పాటు చేశారు. నామినేషన్ల స్వీకరణకు ఏపీవోలు, పిఓలు 14 మందిని నియమించారు. రెండవ రోజు 41 నామినేషన్లు దాఖలు అయ్యాయి.

# నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగాలి..

## - అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్

**ఆమనగల్లు, జనవరి 29 (అక్షర గళం):** ఆమనగల్లు మున్సిపల్ కార్యాలయంలోని ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని గురువారం రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ సందర్శించారు. మున్సిపల్ ఎన్నికలలో భాగంగా



రెండవ రోజు నామినేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఎంతమంది అభ్యర్థులు, ఏయే వార్డుల నుండి నామినేషన్ పత్రాలను వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వార్డుల వారీగా వివరాలను రిజిస్టర్లో నమోదు చేయాలని సూచించారు. రిటర్నింగ్ అధికారులు అభ్యర్థుల నుండి నామినేషన్ పత్రాలను తీసుకునేటప్పుడు నిబంధనలలో పేర్కొన్న అన్ని పత్రాలు ఉన్నాయా లేవా అన్న విషయాన్ని స్పష్టంగా పరిశీలించాలని ఆయన తెలిపారు.






నామినేషన్ దాఖలు చేసిన అనిత శ్రీనివాస్ రెడ్డి



నామినేషన్ దాఖలు చేసిన కాలే మల్లయ్య



నామినేషన్ దాఖలు చేసిన రేవతి శివలింగం



నామినేషన్ దాఖలు చేసిన మానయ్య



నామినేషన్ దాఖలు చేసిన గుర్రం కేశవులు



నామినేషన్ దాఖలు చేసిన కృష్ణ నాయక్



నామినేషన్ దాఖలు చేసిన కండే హరిప్రసాద్



నామినేషన్ దాఖలు చేసిన పాపిశెట్టి రాము



నామినేషన్ దాఖలు చేసిన సయ్యద్ ఖలీల్



నామినేషన్ దాఖలు చేసిన అల్లాజీ గౌడ్



నామినేషన్ దాఖలు చేసిన కండె సీతారాములమ్మ


నామినేషన్ దాఖలు చేసిన వస్పుల సాయిలు

# కెసిఆర్‌కు నోటీసులు కక్షసాధింపు చర్య

**ఇది ప్రతీకారం తప్ప మరోటి కాదు**

**ఎక్స్ వేదికగా కెటిఆర్ విమర్శలు**

**హైదరాబాద్,జనవరి 29(అక్షర గళం):** విచారణల పేరుతో మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికిఈ చర్యలు తీసుకుంటోందని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపించారు. కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడని, నోటీసులతో చరిత్రను చెరిపేయలేరని కేటీఆర్ వెల్లడించారు. ఇది విచారణ కాదు.. ఇది ప్రతీకారం. ఇది న్యాయం కాదు.. ఇది

రాజకీయ దురుద్దేశం. కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడు. నోటీసులతో, బెదిరింపులతో తెలంగాణ చరిత్రను చెరిపేయలేరు. తెలంగాణ ఉద్యమాన్ని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానిస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు. ఈ కక్షసాధింపు రాజకీయాలను బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తోంది.'చావు నోట్లో తలబెట్టి.. కేసీఆర్ సచ్చుడో - తెలంగాణ వచ్చుడో అనే మొక్కవోని సంకల్పంతో సుదీర్ఘ ఉద్యమం చేసి తెలంగాణను సాధించిన మహానాయకుడు కేసీఆర్. సాధించిన తెలంగాణను పదేళ్ల తన పాలనతో ప్రపంచానికి చాటి చెప్పిన నాయకుడు కేసీఆర్. సబ్బండ వర్గాలను కడుపులో పెట్టుకుని, రాష్ట్రాన్ని చంటి బిడ్డలా చూసుకుంటూ సాగునీటి విప్లవం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబంధు, రైతు బీమా, దళితబంధు వంటి పథకాలతో తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిన గొప్ప విజనరీ కేసీఆర్. అడ్డగోలు హామీలు ఇచ్చి, అబద్దాల పునాదుల మీద అధికారంలోకి వచ్చిన అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజల నోట్లో మట్టి కొట్టి,




ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైంది. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, పాలనా లోపాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు, ఇప్పుడు విచారణల పేరుతో కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం అత్యంత దుర్మార్గమైన కక్షసాధింపు రాజకీయానికి నిదర్శనం' అని కేటీఆర్ అన్నారు. ప్రజల పక్షాన నిలబడి, ప్రజల గొంతుకగా ఈ అన్యాయ పాలనపై పోరాటం కొనసాగిస్తాం. తెలంగాణ చరిత్రను విచారణలతో కాదు.. ప్రజల తీర్పుతోనే రాస్తారు' అంటూ మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్‌లో పోస్టు చేశారు.

# ఒడిదుడుకుల మధ్య సూచీలు

**చివర్లో 800 పాయింట్ల లాభంతో ముగింపు**

**న్యూఢిల్లీ,జనవరి 29(అక్షర గళం):** గత రెండ్రోజులుగా లాభపడుతూ వస్తున్న దేశీయ సూచీలు గురువారం ఉదయం నష్టాల బాటలో సాగాయి. ఒక దశలో భారీగా నష్టపోయాయి. అయితే చివర్లో మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపడంతో అనూహ్యంగా పుంజుకున్నాయి. ఇంట్రాడే కనిష్టంతో పోల్చుకుంటే 800 పాయింట్లకు పైగా లాభపడ్డాయి. చాలా రోజుల తర్వాత విదేశీ మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపడం, మెటల్ ఇండెక్స్ లాభాలను ఆర్జించడంతో సూచీలు కోలుకున్నాయి. దీంతో సెనెక్స్, నిఫ్టీ లాభాలతో రోజును ముగించాయి . గత సెషన్ ముగింపు (82,344)తో పోల్చుకుంటే గురువారం ఉదయం ప్లాట్‌గా మొదలైన సెన్సెక్స్ మధ్యాహ్నం వరకు నష్టాల్లోనే చలించింది. ఒక దశలో దాదాపు 600 పాయింట్లు కోల్పోయి 81,707 వద్ద ఇంట్రాడే కనిష్టానికి చేరుకుంది. అయితే మధ్యాహ్నం తర్వాత నష్టాల నుంచి కోలుకుంది. చివరకు సెన్సెక్స్ 221 పాయింట్ల లాభంతో 82,566 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 76 పాయింట్ల లాభంతో 25,418 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లో ఏబీబీ ఇండియా, నాల్కో, ఆయిల్ ఇండియా, టాటా స్టీల్, అదానీ గ్రీన్ ఎనర్జీ మొదలైన షేర్లు లాభాలు ఆర్జించాయి. కేపీఐటీ టెక్నాలజీస్, కెనరా బ్యాంక్, సోలార్ ఇండస్ట్రీస్, ఏషియన్ పెయింట్స్, ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ మొదలైన షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి. బ్యాంక్ నిఫ్టీ 359 పాయింట్లు ఆర్జించింది. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 102 పాయింట్లు లాభపడింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 91.95గా ఉంది.

# ఫోర్త్ ఎస్టేట్‌పై ఆంక్షలు.. ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలు!

బీఆర్ఎస్ పార్టీ ఏబీఎన్ ఛానల్, ఆంధ్రజ్యోతిని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించింది. టీవీ ఛానళ్ల డిబేట్లలో పాల్గొనేటప్పుడు వ్యక్తిగత దూషణలు తగవని బీఆర్ఎస్ పార్టీ అధినాయకుడికి తెలియని విషయం కాదు. కానీ, అదే స్ట్రాటజీగా పార్టీని నడుపుకుంటూ వస్తున్నారు.

అయితే ఇందులో అర్థంకాని విషయం ఒక్కటే; టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినప్పటి నుండీ ఏబీఎన్ పైన, ఆంధ్రజ్యోతి పైన కత్తులు దూస్తూనే ఉన్నది. అయినా ఎక్కడా జంకకుండా పోరాటం చేసి ఛానల్‌ను నడిపారు. ముందు తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఒక్కటే కక్ష గడితే, 2019 నుండి ఆంధ్రాలో వైసీపీ ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించింది.

అందుకని ఏబీఎన్‌ను బీఆర్ఎస్ కొత్తగా బహిష్కరించేదేమీ లేదు. కాకపోతే, "తెలంగాణ గడ్డమీద ఉంటూ, తెలంగాణ గాలి పీల్చుతూ తెలంగాణకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు" అంటున్నది టీఆర్ఎస్ పార్టీ. ముల్కీ రూల్స్ కూడా తెలంగాణ పౌరసత్వాన్ని నిర్ణయించలేదు కానీ, బీఆర్ఎస్ పార్టీ మాత్రం తెలంగాణ పౌరసత్వాన్ని నిర్ణయించే ప్రయత్నం చేస్తోంది. కేసీఆర్ కుటుంబాన్ని విమర్శిస్తే వాళ్ల తెలంగాణ ద్రోహులు!

కానీ తెలంగాణ సమాజానికి అటువంటి సంకుచిత మనస్తత్వం ఎప్పుడూ లేదు. నీరు, నిధులు, నియామకాల కోసం పోరాటానికి తెలంగాణ సమాజం మద్దతు తెలిపింది. ఇక్కడే పుట్టి పెరిగిన వారి మూలాలు వెతికి మరీ, వారు తెలంగాణ సమాజానికి చెందిన వారు కాదనడం సరికాదు. బహుశా మూడోసారి కూడా కేసీఆర్ అధికారంలోకి వచ్చివుంటే, ట్రంప్ మాదిరిగా జన్మతః వచ్చే పౌరసత్వాన్ని రద్దు చేసేవారేమో!

బహిష్కరణ ఉత్తర్వుల్లో "తెలంగాణ గాలి" ని కూడా ప్రస్తావించారు. దాని అర్థం ఏమిటో బీఆర్ఎస్ వారే వివరించాలి. గాలికీ, నీటికి కూడా యాజమాన్య హక్కులు దఖలు పరుచుకుంటున్నారు. మరి ఎక్కడో పశ్చిమ కనుమల్లో, మహాబలేశ్వర్ దగ్గర గౌముఖంలో పుట్టిన కృష్ణానదీ జలాల కోసం ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రతో పోరాటం చేసే హక్కు ఎలా వస్తుంది? మహారాష్ట్రలో పుట్టింది కాబట్టి ఆ రాష్ట్రానికే హక్కు అంటే.. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పోట్లాడుకోవడంలో ఔచిత్యం లేదు.

. త్రయంబకేశ్వరంలో పుట్టిన గోదావరి జలాల మీద కూడా మహారాష్ట్రకే హక్కు అనుకుంటే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పొలాలు బీటలు వారిపోతాయి. గాలికి, నీటికి హద్దులు పెట్టే ప్రయత్నం చేస్తే నష్టపోయేది మనమే.

ప్రసార మాధ్యమాలకు ఒక ప్రాంతం, ఒక రాజకీయపార్టీ రంగు అంటగట్టి కక్షసాధింపు చర్యలు చేపట్టడం వలన, ప్రాంతీయపార్టీ స్థాయి నుండి జాతీయపార్టీ స్థాయికి ఎదగాలని పేరు మార్చుకున్న బీఆర్ఎస్‌కు ప్రయోజనం చేకూరుస్తుంది అనుకుంటే పొరపాటే. డిబేట్‌లో పాల్గొన్న శాసనమండలి సభ్యుడి అనుచిత ప్రవర్తనను మందలించాల్సింది పోయి, ఛానల్‌ను బహిష్కరించడం





బాధ్యతారాహిత్యంగానే భావించాలి. ఎవరి వ్యక్తిగత అభిప్రాయాలు వారికి ఉంటాయి.

కానీ వాటిని వ్యక్తపరచడానికి ఒక పద్ధతి ఉంటుంది. అటువంటి పద్ధతిని పాటించమనడంలో బీఆర్ఎస్ పార్టీకి వచ్చిన నష్టం లేదు. విమర్శించే వారికి దూరంగా ఉండే తత్వం వల్ల తప్పులను సరిదిద్దుకునే అవకాశాన్ని చేజార్చుకోవడం మినహా ఒరిగేదేమీ లేదు.

గతంలో ఇదే ఛానల్ ప్రసారాలను టెలికాస్ట్ చేయకుండా అడ్డుపడ్డారు, అయినా ఓటమి చవిచూడవలసి వచ్చింది. ఇంకా తెలంగాణ సెంటిమెంట్ పైనే ఆధారపడి రాజకీయం చేసే అవస్థలోనే బీఆర్ఎస్ ఉండిపోయింది. పాలిటిక్స్‌లో రాణించిన వారికి తమ గతం తెలిసిన వారంటే ఒక భయం ఉంటుంది.

తాము ఎదిగే క్రమంలో అనుసరించిన పద్ధతులు వారికి తెలుసు కాబట్టి, వారిని చూడగానే ఒక వెరపు ఉంటుంది. మెట్లు ఎక్కకముందు తమ ఆర్థిక పరిస్థితుల నుండి, తాము చేసిన వ్యాపారాలతో సహా అన్నీ తెలిసి ఉండటం వల్ల వారు శత్రువుల్లా కనిపిస్తారు. కేసీఆర్ గారికి రాధాకృష్ణ గారంటే అయిష్టత ఉండటంలో అంతకు మించిన కారణం కనిపించడం లేదు.

కానీ.. తెలంగాణ ఉద్యమం నడిచే రోజుల్లో 'తెలంగాణ రావటం తథ్యం' అని ఆంధ్రా వారి వ్యతిరేకతను లెక్క చేయకుండా బాహాటంగా ప్రకటించింది ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఏబీఎన్ ఛానల్. ఉద్యమానికి నైతిక మద్దతు తెలిపింది కూడా రాధాకృష్ణే. కానీ కేసీఆర్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఆయన టార్గెట్ రాధాకృష్ణకు సంబంధించిన ప్రసార మాధ్యమాలే. ప్రాంతీయపార్టీల తత్వం 'పార్టీయే నాయకుడు, నాయకుడే పార్టీ' అన్నట్లుగా ఉంటుంది.

కానీ కేసీఆర్ ఒకడుగు ముందుకు వేసి 'బీఆర్ఎస్ అంటే చంద్రశేఖరరావే, తెలంగాణ అన్నా కూడా చంద్రశేఖరరావే' అనే పగటి కలలోనే ఉండిపోయారు. పార్టీలో కూడా అలా భజన చేసేవారినే ఆయన ప్రోత్సహిస్తున్నారు. అందుకే పార్టీ చేసిన కొన్ని నిర్ణయాలను వ్యతిరేకించిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన కవితను కూడా దూరం పెట్టేశారు.


ఆయన విమర్శను భరించలేరు, ఎదుర్కోలేరు. అనేక పుస్తకాలు చదివి సాధించిన విజ్ఞానాన్ని పక్కన పెట్టి వ్యవహరించడం వలన, తన స్థాయి వ్యక్తులకుండే గౌరవమర్యాదలను పొందలేకపోతున్నారు కేసీఆర్. ఒకనాడు కేబినెట్‌లో మంత్రి పదవి కోసం చంద్రబాబును బతిమాలుకున్న విషయం ఆయన్ను ఇప్పటికీ కలత పెడుతున్నది. అది గుర్తుకు రాగానే చంద్రబాబును విమర్శించే పనిలో పడతారు. అది ఒకనాటి మాట.

టీడీపీలో మంత్రిగా ఉన్నప్పుడు కేసీఆర్ ప్రత్యేక తెలంగాణ అవసరాన్ని నిర్ద్వందంగా ఖండించారు. 610 జీవో పట్ల కూడా ఆయన అభిప్రాయం వేరేగా ఉన్నది. తరువాతి కాలంలో ఆయన ఆలోచనలు మారాయో లేక అవకాశాల కోసమో కానీ.. ప్రత్యేక తెలంగాణకు జై కొట్టారు. విజయం సాధించారు, కోరుకున్న పీఠాన్ని అధిరోహించారు. అమరావతి శంకుస్థాపనకు వచ్చి చంద్రబాబు సరసన తెలంగాణ ముఖ్యమంత్రిగా ఆసీనులయ్యారు.

ఇప్పుడు టీడీపీలో కేసీఆర్ కంటే జూనియర్ అయిన రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యారు, కేసీఆర్ ప్రతిపక్ష నాయకుడు అయ్యారు. ఇది వర్తమానం. ఇది మరిచి కేసీఆర్ గతంలోనే ఎందుకు జీవిస్తున్నారో అర్థం కాదు. ఒక ధనిక రాష్ట్రానికి రెండు పర్యాయాలు ముఖ్యమంత్రి అయినా.. ఆర్థికంగా వెనుకపడి ఉన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చుట్టూనే రాజకీయం చేస్తూ, ఆయనను, ఆయన పార్టీని తెలంగాణలో సజీవంగా ఉంచుతున్నారు. ఇందుకు టీడీపీ కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపవలసిందే.

ఏబీఎన్ ఛానల్ బహిష్కరించడానికి కూడా తెలంగాణ సెంటిమెంటునే వాడే ప్రయత్నం చేయడం వల్ల కేసీఆర్ స్థాయి మరింతగా దిగజారిపోతున్నది. ఈరోజు రెండు తెలుగురాష్ట్రాలకు సంబంధించిన ప్రసార మాధ్యమాల ప్రధాన కార్యాలయాలన్నీ హైదరాబాద్‌లోనే ఉన్నాయి.

అది గర్వించదగ్గ విషయంగా కేసీఆర్ గుర్తించడం లేదు. గుర్తించి ఉంటే ప్రసార మాధ్యమాలను బహిష్కరించడాలు, తొక్కేసే ప్రయత్నాలు చేయరు. విమర్శను తీసుకోలేని వారు ప్రశంసలకు పాత్రులు కాలేరు!



తెలుగు దిన పత్రిక
https://aksharagalam.com
# అక్షరగళం
నిజం..నిర్భయంగా
గ్రేటర్ -హైదరాబాద్



# సైబరాబాద్ పోలీసుల పటిష్ట పోలిసింగ్..

## నేరాలకు కళ్లెం : క్రైం డీసీపి ముత్యం రెడ్డి

సైబరాబాద్ ,అక్షరగళం: సైబరాబాద్ పోలీసుల పటిష్ట పోలిసింగ్, నిరంతర నిఘా కారణంగా చైన్ స్నాచింగ్‌లు, ద్విచక్ర వాహనాల దొంగతనాలు, ఆలయాల్లో చోరీలు వంటి నేరాలు గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది గణనీయంగా తగ్గాయని సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి తెలిపారు. సైబరాబాద్ పరిధిలో వాహనాల అపహరణ జరిగిన వెంటనే కేసులు నమోదు చేసి, సాంకేతిక ఆధారాలను విశ్లేషిస్తూ పాత నేరస్తులపై నేఘా ఉంచి వారి కదలికలను గుర్తించి వెంటనే అరెస్టులు చేస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాలకు వెళ్లి కూడా అంతర్రాష్ట్ర దొంగల ముఠాలను చాకచక్యంగా అరెస్ట్ చేస్తున్నామన్నారు.

### మచ్చుకు కొన్ని కేసులు:

కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగల ముఠాను కర్ణాటక రాష్ట్రంలోని బీదర్‌లో అరెస్ట్ చేశామన్నారు. దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 15 కేజీల వెండి దొంగిలించిన అంతర్రాష్ట్ర ముఠాను రాజస్థాన్‌లో అదుపులోకి తీసుకున్నామన్నారు. అలాగే పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడిన ఢిల్లీకి చెందిన ముఠాను నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో అరెస్ట్ చేశామని స్పష్టం చేశారు. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఖజానా జ్యువెలరీస్ దోపిడీ కేసులో పూణే (మహారాష్ట్ర), ఉత్తరప్రదేశ్, గుజరాత్, ఢిల్లీ, బీహార్ తదితర రాష్ట్రాల్లో గాలించి నిందితులను అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. జీడిమెట్లలో జరిగిన ఏటీఎం దొంగతనానికి సంబంధించిన అంతర్రాష్ట్ర ముఠాను హర్యానాలోని మేవాడ్ ప్రాంతంలో అరెస్ట్ చేశామని వివరించారు. మరియుకేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఆలయంలో జరిగిన చోరీ కేసులోనూ అంతర్రాష్ట్ర ముఠాను అరెస్ట్ చేసి దేవాలయానికి చెందిన సొత్తును రికవరీ చేశామన్నారు. అంతర్రాష్ట్ర దొంగలను ఎక్కడ దాక్కున్నా వారిని గుర్తించి అరెస్ట్ చేయడమే సైబరాబాద్ పోలీసుల పనితీరుకు నిదర్శనమని డీసీపీ తెలిపారు.

నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల ధన, మాన, ఆస్తి రక్షణకు సైబరాబాద్ పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉన్నారన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు సహకరించాలని, ఏవైనా అనుమానస్పద కదలికలు ఉంటే వెంటనే డయల్ 100, 112 లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.





వివిధ నేరాలలో పట్టుబడ్డ నిందితులు...

# ఏడి సర్వే చేసి వీఎన్ఆర్ పార్క్‌ను కాపాడాలి

**- ఆకుల సతీష్**

కుత్బుల్లాపూర్, అక్షరగళం: మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఏడి సర్వే చేసి బాచుపల్లిలో విఎన్ ఆర్ కాలేజి వారు కబ్జా చేసిన పార్క్ స్థలాన్ని కాపాడాలని బిజేపి సినియర్ నాయకులు అకుల సతీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డికి గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ....

నిజాంపేట్ సర్కిల్ పరిధిలో ప్రగతి నగర్ సర్వే నెంబర్ 142 143 144 నందు మూడు ఎకరాల విస్తీర్ణం200 కోట్ల గల పార్క్ 2018 నుంచి గ్రామపంచాయతీ పార్కు అభివృద్ధి కోసం నిధులు కేటాయించడమే కాకుండా నిజాంపేట్ కార్పొరేషన్ ఏర్పడ్డాకా కోట్ల రూపాయలు ఖర్చు చేసి మొక్కలను పెంచడమే కాకుండా పార్కును అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వం లో మంత్రి స్థాయి వ్యక్తి మరియు అప్పటి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్, ఆర్డిఓ మల్లయ్య, ఏడిసర్వేయర్ రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ శ్రీనివాస్ స్పీడు విద్యుత్ ప్రవేట్ కన్స్ట్రక్షన్ కి వాళ్లకి పార్కు స్థలం ప్రభుత్వ యు ఎల్ సి కాదని ప్రవేట్ స్థలమని తప్పుడు రిపోర్టు ఆధారంగా 2023 సెప్టెంబర్‌లో పార్కును కబ్జా చేసుకుని ఫెన్సింగ్ వేశారని దీంతో బీజేపి పార్టి, మేము పూర్తి ఆధారాలతో పలుమార్లు కలెక్టర్ కి హైడ్రాకి ఫిర్యాదు చేయగా ఇదే నెలలో హైడ్రాధికారులు విఎన్ఆర్ పార్క్ కబ్జా నుంచి విడిపించడమే కాకుండా పెన్సింగ్ వేసి రక్షించారని




అనందం వ్యక్తం చేశారు. కానీ పార్క్ స్థలం ప్రభుత్వ భూమి అని మరియు వీఎన్ఆర్ కాలేజ్ స్కూల్ నందు కూడా సీలింగ్ భూమే కాకుండా సర్వే నెంబర్ 186 ప్రభుత్వ భూమి కూడా ఉందని ఆరోపించారు. గౌరవ హైకోర్టు ఉత్తర్వుల మేరకు గత 27వ తారీకు ఏడి సర్వేకు ఆదేశించిన వీఎన్ఆర్ కాలేజీ స్కూల్ యాజమాన్యం సహకరించక పోవడంతోనే వారి కబ్జా పర్వం బయపదిందని విమర్శించారు.

వారు కబ్జా చేయక పోతే సర్వేకు ఎందుకు సహాకరించడం లేదని ప్రశ్నించారు. అడిషనల్ కలెక్టర్ కి తక్షణమే వీఎన్ఆర్ కాలేజ్ ప్రభుత్వ భూమి మరియు సీలింగ్ భూమి ఆక్రమణ పై పూర్తిస్థాయిలో సర్వే చేయాలని, ఈ సర్వే ఆధారంగా వీఎన్నార్ పార్క్ స్థలం కూడా కాపాడడానికి ఆస్కారం ఉన్నందున తక్షణమే ఏడి సర్వే జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని విజేందర్ రెడ్డికి ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు.

అంతే కాకుండా సర్వేనెంబర్ 78,80,82,83, 90,95 బాచుపల్లి ప్రభుత్వ భూములు మైరాన్ మరియు క్యాండీర్ సంస్థల నిర్మాణంలో ఆక్రమించు కున్నారని తక్షణమే సర్వే చేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని మరొక ఫిర్యాదు కూడా చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అరుణ్ రావు, పాండు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు







కూకట్‌పల్లి జోన్ పోలీసుల విస్తృత తనిఖీలు.....



# చైనా మాంజాపై కూకట్‌పల్లి జోన్ పోలీసుల స్పెషల్ డ్రైవ్



## -నిషేధిత మాంజా విక్రయాలపై ఉక్కుపాదం....

కూకట్‌పల్లి ,అక్షరగళం: చైనా మాంజా విక్రయాలపై కూకట్‌పల్లి పోలీసులు ఉక్కు పాదం మోపారు. పర్యావరణానికి, పక్షులకు, ద్విచక్ర వాహనదారులకు, పాదచారులకు తీవ్ర ప్రాణహాని కలిగిస్తున్న నిషేధిత చైనా మాంజా విక్రయం, వినియోగాన్ని అరికట్టేందుకు కూకట్ పల్లి జోన్ డీసీపీ రితిరాజ్, ఐపీఎస్., ఆధ్వర్యం లో కూకట్‌పల్లి జోన్ పోలీసులు టగురువారం విస్తృత స్థాయిలో ప్రత్యేక డ్రైవ్ లు నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో భాగంగా కూకట్‌పల్లి జోన్ పరిధిలోని బాలానగర్, అల్లాపూర్, మియాపూర్, మాదాపూర్, రాయదుర్గం, కేపీహెచ్‌బీ మరియు కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌ల పరిధిలో తనిఖీలు చేపట్టారు. స్పెషల్ డ్రైవ్ సందర్భంగా మాదాపూర్ పీఎస్ పరిధిలో 11 షాపులు, రాయదుర్గం పీఎస్ పరిధిలో 15 షాపులు,



కేపీహెచ్‌బీ పీఎస్ పరిధిలో 11 షాపులు, మియాపూర్ పీఎస్ పరిధిలో 6 షాపులు, కూకట్‌పల్లి పీఎస్ పరిధిలో 8 షాపులు, బాలానగర్ పీఎస్ పరిధిలో 4 షాపులు, అల్లాపూర్ పీఎస్ పరిధిలో ఒక షాపు లో తనిఖీలు చేపట్టారు. మొత్తంగా 56 షాపుల పై రైడ్లు నిర్వహించారు. కూకట్పల్లి జోన్ వ్యాప్తంగా మొత్తం 30 గాలిపటాల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా, నిషేధిత చైనా మాంజాను విక్రయిస్తున్న వారిపై 5 కేసులు నమోదు చేశారు. ఇందులో కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 3 కేసులు, అల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసు, మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసు నమోదు చేశారు. కేవలం కేసులు నమోదు చేయడమే కాకుండా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కూకట్‌పల్లి జోన్ వ్యాప్తంగా 9 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. చైనా మాంజా విక్రయాలపై పోలీసులు మొత్తం 7 పోలీస్ స్టేషన్ పరిధుల్లో రైడ్లు నిర్వహించారు. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సిద్ధిక్ నగర్, అయ్యప్ప సొసైటీ, కావూరిహిల్స్, కుమ్మరి బస్తీ




ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో మణికొండ, రాయదుర్గం, ఆంజనేయనగర్, ఖాజాగూడ, రాజీవ్ నగర్, మధురానగర్, ప్రసాంతి హిల్స్ కాలనీల్లో రైడ్లు జరిగాయి. కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో 4వ ఫేజ్, 7వ ఫేజ్, కేపీహెచ్‌బీ కాలనీ, హైదర్‌నగర్, తులసీనగర్, అడ్డగుట్ట ప్రాంతం, రామకృష్ణాపురం గ్రౌండ్ పరిసరాల్లో తనిఖీలు నిర్వహించారు.

### చైనా మాంజా వల్ల జరిగే ప్రమాదాలపై ప్రజలకు అవగాహన ....

మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పైప్‌లైన్ రోడ్, మదీనాగూడ, పాత మియాపూర్, మియాపూర్ మై నగర్ ప్రాంతాల్లో, కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతినగర్?కూకట్‌పల్లి ప్రాంతంలో, బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాజు కాలనీ, గౌతమ్ నగర్ ప్రాంతాల్లో, అల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గాయత్రినగర్, పార్థివ నగర్, వీరన్ననగర్ ప్రాంతాల్లో రైడ్లు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో స్థానిక ప్రజలకు, విద్యార్థులకు చైనా మాంజా వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు.

తెలుగు దినపత్రిక https://aksharagalam.com
అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం





జబ్బుల మీద టీకాస్త్రం! ఒక్కసారి సంధిస్తే చాలు. చాలారకాల ఇన్‌ఫెక్షన్ జబ్బులు జీవితంలో మరెప్పుడూ మన దరిజేరవు. చుట్టుపక్కల వాళ్లకూ వ్యాపించవు. టీకాస్త్రాన్ని సరిగా ప్రయోగిస్తే మహమ్మారి జబ్బులనైనా సమూలంగా మట్టుపెట్టొచ్చు. ఒకప్పుడు ప్రపంచాన్ని గడగడలాడించిన మశూచి (స్మాల్‌పాక్స్) పూర్తిగా తుడిచిపెట్టుకుపోవటమే దీనికి నిదర్శనం. అంతెందుకు? పిల్లలను వైకల్యానికి గురిచేసి.. భవిష్యత్తుతో చెలగాటమాడుకునే పోలియోని ఇప్పుడు మనదేశం నుంచి పూర్తిగా నిర్మూలించగలిగామంటే అదంతా టీకా మహాత్మ్యమే. అయినా కూడా టీకాలపై ఇప్పటికీ ఎన్నెన్నో అనుమానాలు, భయాలు, అపోహలు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 2 కోట్ల మంది పిల్లలు అసలు టీకాలకే నోచుకోవటం లేదు. ఒకవేళ తీసుకున్నా అరకొరగా మోతాదులతోనే నెట్టుకొస్తున్నారు. అందుకే ప్రపంచ టీకాల వారం 'టీకాలు కాపాడతాయి: పనిచేస్తాయి' అని నినదిస్తోంది. ఈ నేపథ్యంలో టీకాల ప్రాముఖ్యత, ఆవశ్యకతపై సమగ్ర కథనం ఈవారం మీకోసం.

టీకా అంటే ఒక భరోసా. టీకా అంటే ఒక నమ్మకం. టీకా అంటే ఒక సంరక్షణ. జబ్బుల బారినపడకుండా కాపాడే మంచి తంత్రం, మంత్రం! జబ్బులు వచ్చాక బాధపడితే ఏం లాభం? అవి రాకుండా చూసుకోవటంలోనే ఉంది గొప్పతనం. ఇందుకు టీకానే ఉత్తమ మార్గం. జబ్బుల నివారణలో తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు సాధించటంలో టీకాలను మించిన మంచి కార్యక్రమం మరోటి లేదు. పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంతో ఎదిగేలా చూడటం ప్రతి ఒక్కరి కర్తవ్యం. ఇది వ్యక్తిగతంగానే కాదు.. సమాజానికీ దేశానికీ మేలు చేస్తుంది. నేటి బాలలే రేపటి పౌరులు. అందుకే చిన్న పిల్లల వైద్య విభాగం కేవలం చికిత్సకే (క్యూరేటివ్) పరిమితం కావటం లేదు. జబ్బులు రాకుండా చూడటానికి (ప్రివెంటివ్), పిల్లలు మంచి ఆరోగ్యంతో ఎదగటానికి (ప్రమోటివ్) కూడా అత్యధిక ప్రాధాన్యం ఇస్తుంది. ఇలా అన్ని రకాలుగా పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంతో ఎదిగేలా చూడటంలో టీకాల పాత్ర చాలా కీలకం. క్షయ, కంఠసర్పి, కోరింతదగ్గు, ధనుర్వాతం, గవదబిళ్లలు, రుబెల్లా, న్యుమోనియా, కామెర్లు, పోలియో, విరేచనాలు.. ఇలా పిల్లలను ఉక్కిరిబిక్కిరి చేసే ఎన్నో రకాల జబ్బులకు టీకాలతో ఆదిలోనే ముకుతాడు వేయొచ్చు. పుట్టిన ప్రతి బిడ్డకూ టీకాలను పొందే అర్హత ఉందని, వాటిని ఇప్పించాల్సిన బాధ్యత పెద్దలదేనని తెలుసుకోవాలి. టీకా ఇస్తే బిడ్డ ఏడుస్తుందేమో, నొప్పి పుడుతుందేమో, జ్వరం వస్తుందేమో అని భయపడకుండా సార్వత్రిక టీకా కార్యక్రమంలో పేర్కొన్న అన్ని టీకాలను ఇప్పించాలి. ప్రభుత్వ కార్యక్రమంలో లేని మరికొన్ని టీకాలు ఇప్పించటమూ అవసరమే. కాబట్టి పిల్లలకు అవసరమైన టీకాల గురించి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకొని ఉండటం ఎంతైనా అవసరం.



# టీకా.. భవిష్యత్తుకు భరోసా!

## టీకాలు ఎందుకు?

మన చుట్టూ బోలెడన్ని బ్యాక్టీరియా, వైరస్‌లు తిరుగాడుతుంటాయి. ఇవి శరీరం మీద దాడి చేసినపుడు రకరకాల జబ్బులు (ఇన్‌ఫెక్షన్లు) తలెత్తుతుంటాయి. నిజానికి హానికారక సూక్ష్మక్రిముల నుంచి మన రోగనిరోధక వ్యవస్థ నిరంతం కాపాడుతూనే ఉంటుంది. అయితే కొన్నిసార్లు సూక్ష్మక్రిములు రోగనిరోధక వ్యవస్థను అధిగమించి తమ ప్రతాపాన్ని చూపొచ్చు. ఇది జబ్బులకు దారితీస్తుంది. దీనికి ప్రధాన కారణం హానికారక సూక్ష్మక్రిములను మన రోగనిరోధక వ్యవస్థ గుర్తించలేకపోవటం. మరి సూక్ష్మక్రిములను రోగనిరోధక వ్యవస్థ గుర్తించగలిగిలా చేయగలిగితే? సరిగ్గా టీకాలు చేసే పని ఇదే. హానికారక సూక్ష్మక్రిములు ఏవి? వాటిని ఎదుర్కోవటం, నిర్మూలించటం ఎట్లా? అనేవి రోగనిరోధక వ్యవస్థ గుర్తించటానికి టీకాలు తోడ్పడతాయి. ఇలా జబ్బుల బారినపడకుండా కాపాడతాయి.

## ప్రధానంగా 3 రకాలు

నిజానికి టీకాల్లో ఉండేవి కూడా సూక్ష్మక్రిములే. కాకపోతే ఇవేవీ మనకు హాని చేయవు. సూక్ష్మక్రిములను నిర్వీర్యం చేసో.. చంపేసో లేదంటే వాటి భాగాలతోనో టీకాలను తయారుచేస్తారు. జీవించి ఉన్న సూక్ష్మక్రిములతో కూడినవి సజీవ (లైవ్) టీకాలు. సూక్ష్మక్రిములను నిర్వీర్యం చేసి వీటిని రూపొందిస్తారు. అందువల్ల ఇవి ఒంట్లోకి చేరినా వృద్ధి చెందవు, వ్యాపించవు. కానీ మన రోగనిరోధక వ్యవస్థ ఈ సూక్ష్మక్రిములను పసిగట్టి.. వాటిని ఎదుర్కోవటానికి అవసరమైన యాంటీబాడీలను తయారుచేసుకొని పెట్టుకుంటుంది. చనిపోయిన సూక్ష్మక్రిములతో తయారుచేసేవి విగత (కిల్డ్) టీకాలు. ఇక సూక్ష్మక్రిముల భాగాలతో రూపొందించినవి ఆంశిక (కాంపోనెంట్) టీకాలు. వీటిల్లోని సూక్ష్మక్రిముల భాగాలను, ప్రోటీన్ల వంటి వాటిని శరీరం పసిగట్టి యాంటీబాడీలను తయారుచేసుకుంటుంది. ఇవి మన శరీరంలో జీవితాంతం ఉంటాయి. మున్ముందు మళ్లీ ఎప్పుడైనా అవే సూక్ష్మక్రిములు దాడిచేస్తే ఇవి పెద్దఎత్తున ఉత్పత్తయ్యి సూక్ష్మక్రిముల పని పడతాయి. మన రోగనిరోధక వ్యవస్థలో టి కణాలు, బి కణాలు ఉంటాయి. టి కణాలను జ్ఞాపక కణాలని అనుకోవచ్చు. ఇవి ఆయా సూక్ష్మక్రిములను ఎప్పటికీ మరచిపోవు. అలాంటి క్రిములు ఒంట్లో ఎప్పుడు ప్రవేశించినా వెంటనే గుర్తుపట్టి యాంటీబాడీల ఉత్పత్తిని ప్రేరేపిస్తాయి. ఇక బి కణాలేమో అవసరమైనపుడు యాంటీబాడీలను తయారుచేస్తాయి.

### జాగ్రత్తలు తప్పనిసరి

* నాణ్యమైన టీకాలు ఇప్పిస్తున్నామా లేదా అనేది చూసుకోవాలి. టీకాలు చెడిపోకుండా వాటిని చల్లటి పెట్టెలో భద్రపరచటం చాలా కీలకం. ఏమాత్రం ఎండ తగిలినా టీకా నిర్వీర్యమైపోతుంది. ఇచ్చినా పనిచేయదు.
* చల్లటి పెట్టెలోంచి లేదా ఫ్రిజ్‌లోంచి తీశాక వెంటనే టీకాను ఇచ్చేలా చూసుకోవాలి. కొన్ని టీకాలు పొడి రూపంలో ఉంటాయి. వీటికి డిస్టిల్డ్ నీళ్లు కలిపి ఇవ్వాల్సి ఉంటుంది. ఇలాంటి టీకాలను ఎప్పటికప్పుడే ఇచ్చేయాలి. మిగిలిపోతే మర్నాడు ఇవ్వటం తగదు. ఇద్దరు ముగ్గురికి ఇవ్వాల్సినపుడు ఒకటే మోతాదు గల సీసాను వాడుకోవటం మంచిది.
* ఏ టీకా తీసుకున్నా అరగంట వరకు ఆసుపత్రిలోనే ఉండాలి. ఏవైనా దుష్ప్రభావాలు తలెత్తితే వెంటనే జాగ్రత్త పడటానికి వీలుంటుంది. ఆసుపత్రుల్లో కూడా దుష్ప్రభావాలు తలెత్తినపుడు అత్యవసరంగా చికిత్స చేయటానికి అవసరమైన సదుపాయాలన్నీ ఉండాలి.
* టీకాల పట్టీలో టీకా ఇచ్చిన తేదీతో పాటు టీకా బ్యాచ్ సంఖ్య, తయారైన తేదీ కూడా నమోదు చేయాలి. ఏవైనా దుష్ప్రభావాలు తలెత్తితే ఆ టీకా ఎక్కడెక్కడ ఉన్నది, ఎవరికి ఇచ్చారనేది వెంటనే తెలిసిపోతుంది.

## సురక్షితకే తొలి ప్రాధాన్యం!

టీకాల విషయంలో ఎప్పుడైనా సురక్షితకే తొలి ప్రాధాన్యం. మంచి ఆరోగ్యంతో ఉన్న పిల్లలకు టీకా ఇస్తున్నామంటే దాంతో ఎలాంటి హాని కలగకుండా ఉండటం ముఖ్యం. అందుకే టీకాలను రూపొందించినపుడు ముందుగా జంతువుల మీద ప్రయోగించి అవి సురక్షితమా? కాదా? ఎంత సమర్థంగా పనిచేస్తున్నాయి? అనేది తెలుసుకుంటారు. అనంతరం మనుషుల మీద ప్రయోగించి చూస్తారు. అవి సురక్షితంగా, బాగా పనిచేస్తున్నాయని తేలితేనే పిల్లలకు ఇచ్చి పరీక్షిస్తారు. ఇలా నాలుగైదు ప్రయోగ పరీక్షలు చేసి.. అన్నింట్లోనూ మంచి ఫలితం కనబడితే ఎక్కువమంది పిల్లలకు ఇచ్చి చూస్తారు. అప్పుడు కూడా ఎలాంటి దుష్ప్రభావాలు లేకుండా పని చేస్తున్నట్టు తేలితేనే అందరికీ ఇవ్వటానికి అనుమతిస్తారు.

## చులకనగా చూడొద్దు!

ప్రభుత్వం ఉచితంగా ఇస్తోందనో, చవకగా దొరుకుతున్నాయనో టీకాలను చులకగా చూడొద్దు. ఇవి శాస్త్రవేత్తలు ఎంతో సమయం వెచ్చించి, నిబద్ధతతో శ్రమించి మానవాళికి అందించిన గొప్ప వరాలు. వీటి తయారీ పెద్ద యజ్ఞం లాంటిది. ఒక టీకా రూపకల్పన దగ్గర్నుంచి ప్రయోగ పరీక్షలన్నీ దాటుకొని అందరికీ అందుబాటులోకి రావటానికి కనీసం 1015 సంవత్సరాలు పడుతుంది. అదీ ఇరవై టీకాల మీద ప్రయోగాలు చేస్తే ఒకటో రెండో విజయవంతమవుతాయి. టీకాల పరిశోధన, రూపకల్పనకు ఖర్చు కూడా ఎక్కువే అవుతుంది. కాబట్టి టీకాలను తేలికగా తీసుకోవటానికి వీల్లేదు.

## టీకా మరచిపోతే..

ఎప్పుడైనా టీకా వేయించటం మరచిపోతే ఆలస్యం చేయకుండా వీలైనంత త్వరగా ఇప్పించాలి. అయితే ఒక మోతాదుకు మరో మోతాదుకు మధ్యలో కనీసం నెల వ్యవధి ఉండేలా చూసుకోవాలి. ఉదాహరణకు ఆరోవారం వేయించాల్సిన టీకా మరచిపోయారు. పదో వారం దగ్గర పడింది. అప్పుడు ఆరోవారం వేయించాల్సిన టీకాను ఇప్పించి.. నెల తర్వాత పదోవారం మోతాదు ఇప్పించాలి.

## బూస్టర్ టీకా ఎందుకు?

టీకాలు ఇప్పించాం కదా. మళ్లీ బూస్టర్ టీకాలు ఎందుకని కొందరు భావిస్తుంటారు. ఇది తప్పు. కొన్ని టీకాల ప్రతిస్పందన కొన్నిరోజులకు నిద్రావస్థలోకి వెళ్లిపోతుంటుంది. బూస్టర్ టీకా ఇవ్వగానే యాంటీబాడీలు తిరిగి పుంజుకుంటాయి. అంటే టీకాల ప్రభావం తగ్గకుండా ఉంటుందన్నమాట. ఒకసారి టీకా ఇచ్చినపుడు కొన్ని యాంటీబాడీలు తయారవుతాయి. రెండోసారి ఇస్తే అవి మరింత ఎక్కువగా పుట్టుకొస్తాయి. మూడోసారి ఇస్తే ఇంకాస్త ఎక్కువగా పుట్టుకొస్తాయి. టీకా మోతాదు అంతే అయినా ప్రతిస్పందన తీరు మరింత ఉద్ధృతంగా ఉంటుంది. కాబట్టి కొన్ని టీకాలకు బూస్టర్ అవసరమని గుర్తించాలి.

## పెద్దలకు కూడా..

టీకాలనగానే ముందు చిన్న పిల్లలు గుర్తుకొచ్చే మాట నిజమే గానీ పెద్దలకు ముఖ్యంగా వృద్ధులకు కూడా కొన్ని టీకాలు అవసరం. అరవై ఏళ్లు దాటిన అందరూ ఫ్లూ టీకా తీసుకోవాలి. దీన్ని ఏటా తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే న్యుమోనియా రాకుండా న్యుమోకోకల్ టీకా తీసుకోవాలి. దీన్ని ఒక మోతాదు తీసుకుంటే సరిపోతుంది.

## ప్రత్యేక పరిస్థితుల్లో..

జాతరలు, మేళాలు, కుంభమేళాల వంటి ప్రత్యేక పరిస్థితుల్లో కలరా వచ్చే అవకాశముంది. అందువల్ల అక్కడికి వెళ్లిన అందరూ కలరా టీకా తీసుకోవాల్సి ఉంటుంది. కుక్క కరచినపుడు రేబిస్ టీకా అవసరపడుతుంది. దీన్ని ఇచ్చిన తర్వాత వారం, పది రోజులకు గానీ యాంటీబాడీలు ఉత్పత్తి కావు. కాబట్టి రేబిస్ ఇమ్యునోగ్లోబులిన్లు కూడా ఇవ్వాల్సి ఉంటుంది.

## తల్లిపాలే తొలి టీకా


నిజానికి పిల్లలకు తొలి టీకా తల్లిపాలే. తొలిసారిగా వచ్చే ముర్రుపాలలో యాంటీబాడీలు, రోగనిరోధక వ్యవస్థ ప్రేరేపకాలు సంసిద్ధంగా ఉంటాయి. కాబట్టి మాములు కాన్పయినా, సిజేరియన్ అయినా బిడ్డ పుట్టిన గంటలోపు.. వీలైనంత త్వరగా తల్లిపాలు పట్టటం తప్పనిసరి. తల్లిపాలు ఇవ్వకపోతే తొలి టీకా ఇవ్వనట్టే!

## క్రమం తప్పకుండా..

పిల్లలకు సార్వత్రిక టీకా కార్యక్రమంలో చాలావరకు టీకాలు ఇస్తున్నారు. ఇందులో లేని మరికొన్ని టీకాలు కూడా పిల్లలకు అవసరమేనని పిల్లల వైద్య సమాఖ్య సిఫారసు చేస్తోంది.

### తొలిరోజున..

* ఎడమ చేయికి బీసీజీ టీకా ఇవ్వాలి. ఇది క్షయ



బారినపడకుండా కాపాడుతుంది. అలాగే పోలియో టీకా చుక్కలు వేస్తారు. దీన్ని 'జీరో డోస్' అంటారు. ఇది మిగతా పోలియో మోతాదులకు అదనం. వీటితో పాటు హెపటైటిస్ బి టీకా ఇవ్వాలి. దీన్ని తొడకు వెలుపలి వైపున ఇవ్వటం మంచిది. ఎందుకంటే పుట్టినపుడు పిల్లలకు కండరం ఇక్కడే ఎక్కువగా ఉంటుంది.

### 6వ వారాల తర్వాత..

* ఆరో వారం తర్వాత పోలియో చుక్కలతో పాటు కంఠసర్పి, కోరింతదగ్గు, ధనుర్వాతం నుంచి రక్షించే డీపీటీ టీకా కూడా ఇవ్వాలి. అలాగే చెవి ముక్కు గొంతు ఇన్‌ఫెక్షన్లు, న్యుమోనియా, మెదడు వాపు రాకుండా చూసే హిమోఫిలస్ ఇన్‌ఫ్లుయెంజా బి (హిబ్) టీకా.. కామెర్ల నుంచి కాపాడే హెపటైటిస్ బి టీకా కూడా ఇవ్వాలి. ఇప్పుడు డీపీటీ, హిబ్, హెపటైటిస్ బి టీకాలన్నీ ఒక్క టీకా రూపంలోనే (పెంటావాలెంట్) అందుబాటులో ఉంది. ఈ ఒక్కటి ఇప్పిస్తే ఐదు జబ్బుల నుంచీ రక్షణ లభిస్తుంది.
* పోలియో చుక్కలతో పాటు ఇటీవలి కాలంలో పోలియో సూది టీకా (ఇంజెక్టబుల్ పోలియో వ్యాక్సిన్ ఐపీవీ) కూడా ఇస్తున్నారు. ఇతర దేశాల్లో ఐపీవీనే ఇస్తుంటారు. మనదేశంలోనూ నెమ్మదిగా చుక్కల మందును తీసేసి సూది టీకాను ఇవ్వాలని భావిస్తున్నారు. ఈ క్రమంలోనే పోలియో చుక్కలతో పాటు సూది టీకానూ ఇస్తున్నారు. కొన్నాళ్లు పోయాక ఒక్క పోలియో సూది టీకానే ఇవ్వచ్చు.

### 10, 14 వారాల తర్వాత..

* 10వ వారం అలాగే 14వ వారం తర్వాత పెంటావాలెంట్ టీకాను ఇవ్వాలి. దీంతో మొత్తం మూడు మోతాదులు పూర్తవుతాయి. అలాగే పోలియో చుక్కలు, పోలియో సూది టీకా కూడా ఇవ్వాలి. ఇవి కాకుండా న్యుమోనియా బారినపడకుండా చూసే పీసీవీ టీకా, విరేచనాల నుంచి రక్షించే రోటా టీకా కూడా అవసరమే. దాదాపు 141 దేశాలు తమ జాతీయ టీకా కార్యక్రమంలో వీటిని ఇస్తున్నాయి. మనదేశంలోనూ సార్వత్రిక టీకా కార్యక్రమంలో కొన్ని రాష్ట్రాల్లో వీటిని ఇస్తున్నారు. త్వరలోనే వీటిని అన్ని రాష్ట్రాలకూ విస్తరించనున్నారు.

### 6వ నెలలో..

* ఫ్లూ టీకా ఇవ్వాలి. (ప్రభుత్వ టీకా కార్యక్రమంలో లేకపోయినప్పటికీ దీన్ని 6వ నెలలో ఆరంభించి.. నెల తర్వాత మరో మోతాదు ఇప్పించాలి. ఆ తర్వాత ప్రతి ఏటా ఒక మోతాదు తప్పకుండా ఇప్పించాలి)

### 9 నెలల తర్వాత..

* గతంలో తట్టు, తడపర నుంచి కాపాడే మీజిల్స్ టీకా మాత్రమే ఇచ్చేవారు. ఇప్పుడు దీనికి రుబెల్లా (జర్మన్ మీజిల్స్) టీకాను కూడా కలిపి 'ఎంఆర్ టీకా ఇస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో దీనికి బదులు గవదబిళ్ల నుంచి కాపాడే మమ్స్ టీకాతో కూడిన ఎంఎంఆర్ టీకా ఇస్తున్నారు. దీంతో పాటు టైఫాయిడ్ టీకా కూడా ఇప్పించాలి. అలాగే మెదడువాపు ఎక్కువగా కనబడే జిల్లాల్లో 'జపనీస్ ఎన్‌కెఫలైటిస్ (జెబి) బి టీకా' కూడా ఇప్పించటం అవసరం.

### 12 నెలల తర్వాత..

* హెపటైటిస్ ఎతో పాటు ఆటలమ్మ నుంచి రక్షించే వారిసెల్లా టీకా ఇప్పించాలి.

### 15 నెలల తర్వాత..

* పీసీవీ బూస్టర్, ఎంఎంఆర్ ఇప్పించాలి.

### 16–18 నెలల్లో..

* పోలియో, డీపీటీ, హిబ్ బూస్టర్ టీకాలు.. అలాగే హెపటైటిస్ ఎ రెండో మోతాదు కూడా ఇప్పించాలి.

### 4–6 ఏళ్లలో..

* డీపీటీ బూస్టర్, వారిసెల్లా రెండో మోతాదు, ఎంఎంఆర్ టీకా ఇప్పించాలి.

### 9 ఏళ్లు దాటాక..

* టీడ్యాప్ టీకా ఇవ్వాలి. అలాగే అదనంగా బాలికలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బారినపడకుండా చూసే హెచ్‌పీవీ టీకా ఇప్పించాలి. దీన్ని మొత్తం మూడు మోతాదులు (మొదటి టీకా తీసుకున్నాక 2 నెలలకు, 6 నెలలకు) ఇప్పించాలి. క్యాన్సర్ నుంచి తప్పించే టీకా ఇదొక్కటే కావటం గమనార్హం. అయితే దీన్ని 11 ఏళ్ల లోపే తీసుకుంటే రెండు మోతాదులే సరిపోతాయి. అదే 12 ఏళ్లు దాటితే మూడు మోతాదులూ తీసుకోవాలి.

### అపోహలు వద్దు!

* టీకా తీసుకోవటం తప్పనిసరి కాదన్నది కొందరి అపోహ. ఇష్టముంటే తీసుకోవచ్చు, లేకపోతే లేదు అని భావిస్తుంటారు. ఇది సరికాదు. టీకాలు తీసుకోవటం పిల్లల హక్కు. ఇచ్చే బాధ్యత మనది. వాళ్ల హక్కు లను పరిరక్షించాలి. బాధ్యతాయుతంగా ఇప్పించాలి.
* టీకాలతో ఆటిజమ్, మెదడు దెబ్బతినటం, సంతానలేమి వంటివి తలెత్తుతాయన్నది మరికొందరి అపోహ. ఇందులో నిజం లేదు. టీకాలు సురక్షితమని గుర్తించాలి.
* టీకా ఇవ్వటం వల్ల సహజ రక్షణ వ్యవస్థ క్షీణిస్తుందని మరికొందరు అనుకుంటుంటారు. ఇది తప్పు. యాంటీ వ్యాక్సిన్ లాబీలు చేసే ప్రచారాలు నమ్మొద్దు. వాటిని వ్యాపింపజేయొద్దు. టీకాలతో సహజ రక్షణ వ్యవస్థను ప్రేరేపిస్తున్నామే గానీ అణచి వేయటం లేదని తెలుసుకోవాలి.
* టీకా ఇచ్చినపుడు కొందరికి నొప్పి, జ్వరం వంటి చిన్నా చితకా ఇబ్బందులు ఉంటే ఉండొచ్చు. ఇవి తాత్కాలికం. టీకాలతో ఒనగూడే ప్రయోజనాలతో పోలిస్తే ఇవి ఒక లెక్కలోకే రావు. అందువల్ల వీటిని పెద్దగా పట్టించుకోవద్దు.

# ఎముకకు ఆటల బలం!

యుక్తవయసులో శరీరం, ఎముకల ఎదుగుదల చురుకుగా, వేగంగా సాగుతుంది. ఒకవేళ దీనికి ఏదైనా అవాంతరం తలెత్తితే మున్ముందు జీవితాంతం ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా ఎముక సాంద్రత తగ్గిపోయి.. ఎముకలు క్షీణించటం, తేలికగా విరిగిపోవటం వంటి ముప్పులు పెరుగుతాయి. అందువల్ల యుక్తవయసులో తగినంత శారీరకశ్రమ, వ్యాయామం చేసేలా పిల్లలను ప్రోత్సహించటం ఎంతో మంచిది. ఇవి కుదరకపోతే కనీసం ఆరుబయట ఆటలు ఆడేలా చూసినా మేలే. దీంతో ఎముకల్లోకి క్యాల్షియం బాగా చేరుకుని, ఎముక పుష్టికి తోడ్పడుతుంది. తాజా అధ్యయనం ఒకటి దీన్ని మరోసారి బలపరిచింది. ఫుట్‌బాల్ ఆడటం వల్ల యుక్తవయసు మగపిల్లల్లో ఎముకల వృద్ధి మెరుగ్గా ఉంటున్నట్టు బ్రిటన్‌లోని ఎక్స్‌టర్ విశ్వవిద్యాలయ అధ్యయనం పేర్కొంటోంది. ఈత కొట్టటం, సైకిల్ తొక్కటం



వంటి వాటి కంటే కూడా ఫుట్‌బాల్‌తోనే మరింత మెరుగైన ఫలితం కనబడుతుండటం విశేషం. అధ్యయనంలో భాగంగా 12 14 ఏళ్ల భావి క్రీడాకారులను ఎంచుకొని ఏడాది పాటు పరిశీలించారు. ఈత, సైకిల్ క్రీడాకారులతో పోలిస్తే వీరిలో ఎముకలోని ఖనిజాల మోతాదు (బీఎంసీ) మరింత ఎక్కువగా ఉంటున్నట్టు గుర్తించారు. వారానికి 9 గంటల సేపు ఫుట్‌బాల్ సాధన చేసేవారినే తాము పరిశీలించినప్పటికీ.. వారానికి 3 గంటల సేపు ఫుట్‌బాల్ ఆడినా గణనీయమైన ఫలితం కనబడుతుందని పరిశోధకులు చెబుతున్నారు. తీవ్రమైన శారీరకశ్రమను కలగజేస్తూ, కండరాలపై బాగా ప్రభావం చూపే టెన్నిస్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్ వంటి క్రీడలు కూడా ఇలాంటి ప్రభావమే చూపగలవని పేర్కొంటున్నారు. కాబట్టి వీలైనప్పుడల్లా పిల్లలను ఆటలు ఆడేలా ప్రోత్సహించటం మంచిది. ఇవి భవిష్యత్తు ఆరోగ్యానికి సోపానాలుగా పనిచేస్తాయి. పెద్దయ్యాక మరింత బలంగా, దృఢంగా ఉండేందుకు కూడా తోడ్పడతాయి.

# శీతల పానీయాలతో సంతానలేమి!

శరీర పోషణకోసం అంటూ మనం తీసుకునే ఆహార పానీయాల్లో కొన్ని నేడు మన ఆరోగ్యాన్నే దెబ్బ తీసే పరిస్థితులు తయారవుతున్నాయి. ఒక దశలో పునరుత్పత్తి వ్యవస్థనే నిర్జీవంగా మార్చేస్తున్నాయి. ప్రత్యేకించి సోడాలు, ఇతర శీతల పానీయాలు (సాఫ్ట్ డ్రింక్స్) కొన్ని సేవించడం వల్ల స్త్రీ పురుషులు ఇరువుల్లోనూ సంతాన లేమి సమస్యలు తలెత్తుతున్నాయి. గమనిస్తే, దాదాపు అన్నిరకాల శీతల పానీయాల్లోనూ కృత్రిమ తీపిని కలిగించే ఆస్పరేటమ్ అనే పదార్థం కనపడుతుంది. ఇది ఎండోక్రైన్ గ్రంథుల మీద దుష్ప్రభావాన్ని చూపుతుంది. ఫలితంగా హార్మోన్ల అసమతుల్యత ఏర్పడి, ఇది కూడా సంతానోత్పత్తి సమస్యలకు కారణమవుతుంది. సోడాలు, శీతలపానీయాలను అతిగా సేవించే స్త్రీలలో అండాశయ సమస్యలు ఏర్పడటంతో పాటు పీ.ఎమ్. ఎస్ (ప్రీ మెన్‌స్ట్రువల్ సింటమ్స్) లో హెచ్చు తగ్గులు ఏర్పడతాయి. ఈ ఆస్పరేటమ్ వల్ల సంతానోత్పత్తి సమస్యలతో పాటు గర్భస్రావాలు, గర్భస్థ శిశు వైకల్యాలు ఏర్పడే ప్రమాదం కూడా ఉంది.



ఆస్పరేటమ్‌లో సహజంగానే ఫినైలలానిన్, ఆస్పార్టిక్ యాసిడ్ అనే రెండు ఆమ్లాలు కూడా ఉంటాయి. వీటిని ఇతర అమైనో ఆమ్లాలతో కలిపి సేవిస్తే హానికరమేమీ కాదు. అలా మరి వేటితోనూ కలపకుండా విడిగా సేవిస్తే, శరీర కణాలు చనిపోయే అవకాశం ఉంది. మరీ ఎక్కువగా సేవిస్తే, పురుషుల వీర్యకణాలు, స్త్రీల అండకణాలు దాదాపు 90 శాతం దాకా నశించే ప్రమాదం ఉంది.

ఎక్కువ తీయగా ఉండే ఇలాంటి పానీయాలు ఏవి తాగినా, వ్యాధి నిరోధక శక్తి క్షీణిస్తుంది. సంతానోత్పత్తికి అతి ముఖ్యమైన అంశాలు శరీరంలో తగ్గిపోతాయి. హార్మోన్ల అసమతుల్యతతో పాటు ఊబకాయం వచ్చేస్తుంది.

శీతల పానీయాలు ఎక్కువగా తాగే పురుషుల్లో వీర్యకణాల సంఖ్య, జీవత్వం, వాటి చలనశక్తి తగ్గే అవకాశం ఉంది. సోడాల్లో ఆమ్లాలు మరీ ఎక్కువ గా ఉంటాయి. వీటి వల్ల పీ.హెచ్. శాతం మారిపోతూ ఉంటుంది. పీ.హెచ్ ఎక్కువైతే, పోషకాలు నిలవవు. దీని వల్ల వీర్యకణాల ఆకారం మారడం, నాణ్యత లోపించడం, లేదా వీర్యకణాలు చనిపోవడం జరగవచ్చు. వీటిల్లో ఉండే బిస్ ఫినాల్‌ఎ (బిపిఎ) అనే రసాయనం వల్ల పురుషుల వీర్యద్రవం, నాణ్యత క్షీణిస్తాయి.

తెలుగు దినపత్రిక https://aksharagalam.com
అక్షరగళం
ప్రతి అక్షరం ప్రజల కోసం

# ఒప్పుకోకుంటే లేచి పోదామనుకున్నం

## పెళ్లి వార్తలపై షికింగ్ విషయాలు చెప్పిన కీర్తి సురేశ్

'మహానటి' కీర్తి సురేష్ తన చిన్ననాటి స్నేహితుడు, లాంగ్ టైమ్ బాయ్‌ఫ్రెండ్ ఆంటోనీ తట్టిల్‌ను ప్రేమ వివాహం చేసుకుని అభిమానులను సర్ప్రైజ్ చేసిన విషయం తెలిసిందే. అయితే తాజాగా తన ప్రేమ, పెళ్లికి సంబంధించిన కొన్ని షాకింగ్ విషయాలను కీర్తి సురేష్ తాజాగా పంచుకుంది. తాము 15 ఏళ్లుగా ప్రేమలో ఉన్నామని, ఒకానొక దశలో తమ పెళ్లికి పెద్దలు అంగీకరించకపోతే 'లేచిపోయి' పెళ్లి చేసుకోవాలని కూడా నిర్ణయించుకున్నట్లు ఆమె వెల్లడించి అందరినీ ఆశ్చర్యపరిచింది. తమ పెళ్లి ఇంత వైభవంగా, అందరి సమక్షంలో జరుగుతుందని తాము అస్సలు ఊహించలేదని, కానీ చివరికి పెద్దల అంగీకారంతో గోవాలో కుటుంబ సభ్యుల మధ్య తమ వివాహం వేడుకగా జరిగిందని కీర్తి పేర్కొంది. పెళ్లి సమయంలో జరిగిన భావోద్వేగ క్షణాలను గుర్తు చేసుకుంటూ, ఎప్పుడూ చాలా ధైర్యంగా, దృఢంగా ఉండే ఆంటోనీ తాళి కట్టే సమయంలో తొలిసారి ఎమోషనల్ అయ్యాడని ఆమె తెలిపింది. ఆయన కళ్లలో నీళ్లు చూడటంతో తాను కూడా భావోద్వేగానికి లోనయ్యానని, 15 ఏళ్ల నిరీక్షణ కేవలం 30 సెకన్ల మంగళసూత్ర ధారణతో ఒక అందమైన బంధంగా మారిందని కీర్తి ఆనందం వ్యక్తం చేసింది. ఆ క్షణం ఒక కల నిజమైనట్లు అనిపించిందని, ఆ ఆనందంలో కన్నీళ్లు ఆగలేదని ఆమె చెప్పుకొచ్చింది. ప్రస్తుతం కీర్తి సురేష్ తన వైవాహిక జీవితాన్ని ఎంజాయ్ చేస్తూనే, వరుస సినిమాలతో కెరీర్ పరంగా కూడా దూసుకుపోతోంది.



# అమ్మా నీ ఆశీర్వాదమే నా బలం

## తల్లి అంజనాదేవి పుట్టినరోజు చిరు పోస్ట్

పదవులు, ఖ్యాతి, పేరు ఎంత ఉన్నా.. తల్లి ముందు మాత్రం ప్రతి కొడుకు చిన్నవాడే. అదే విషయాన్ని మరోసారి నిరూపించారు మెగాస్టార్ చిరంజీవి. కోట్లాది మంది అభిమానులకు ఆయన లెజెండ్ అయినా, తన తల్లి అంజనా దేవి ముందు మాత్రం ఒక సాధారణ కుమారుడిగా మారిపోతారు. ఆమె పుట్టినరోజు సందర్భంగా చిరంజీవి చేసిన భావోద్వేగ పోస్ట్ ఇప్పుడు అభిమానులను హత్తుకుంటోంది. జనవరి 29 అంజనా దేవి పుట్టినరోజు కావడంతో, చిరంజీవి సోషల్ మీడియా వేదికగా ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. 'అమ్మా.. నీ ఆశీర్వాదమే నా బలం. పుట్టినరోజు శుభాకాంక్షలు' అంటూ ఎక్స్ లో ఓ ఎమోషనల్ మెసేజ్‌ను పంచుకున్నారు.

ఈ సందేశంతో పాటు ఒక ప్రత్యేక వీడియోను కూడా అభిమానులతో షేర్ చేశారు. ఆ వీడియోలో మెగా కుటుంబ సభ్యులందరితో కలిసి అంజనా దేవి గడిపిన అరుదైన క్షణాలు, కుటుంబ వేడుకల ఫోటోలు, మధురమైన జ్ఞాపకాలు కనిపిస్తున్నాయి. ఈ విజువల్స్ అభిమానులను మాత్రమే కాదు, సామాన్య ప్రేక్షకులను కూడా భావోద్వేగానికి గురిచేస్తున్నాయి. వీడియో విడుదలైన కొద్దిసేపటికే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మెగా అభిమానులు పెద్ద ఎత్తున స్పందిస్తూ అంజనమ్మకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. చిరంజీవి తన తల్లిపై ఉన్న ప్రేమను ఎప్పుడూ దాచుకోరు. ప్రతి ఏడాది ఆమె పుట్టినరోజు, మదర్స్ డే వంటి సందర్భాల్లో తప్పకుండా ఆమెను గుర్తు చేసుకుంటారు. షూటింగ్‌లు, రాజకీయ కార్యక్రమాలు, ఇతర బాధ్యతలతో ఎంత బిజీగా ఉన్నా.. తల్లితో సమయం గడపడానికి చిరు ఎప్పుడూ ప్రాధాన్యత ఇస్తారని సన్నిహితులు చెబుతుంటారు. కుటుంబ విలువలు, క్రమశిక్షణ, ఓర్పు, సహనం వంటి గుణాలు తన తల్లి నుంచే నేర్చుకున్నానని చిరంజీవి పలు సందర్భాల్లో వెల్లడించారు. మెగా కుటుంబానికి అంజనా దేవి ఒక అండగా, ధైర్యంగా ఉంటారని చిరు ఎప్పుడూ చెబుతుంటారు. గత ఏడాది కూడా ఆమె పుట్టినరోజును కుటుంబ సభ్యుల మధ్య ఘనంగా నిర్వహించారు.



# వరుసగా సినిమాలతో ప్రభాస్ బిజీ




వరుసగా సినిమాలు పూర్తి చేయడంలో ప్రభాస్ బిజీగా ఉన్నారు. ప్రస్తుతం 'ఫౌజీ', 'స్పిరిట్' సినిమాల చిత్రీకరణ సాగుతుండగా, 'కల్కి2' సినిమానీ పట్టాలెక్కించాలని నిర్ణయించారు. విజయవంతమైన 'కల్కి 2898 ఏడీ'కి కొనసాగింపుగా రూపొందుతున్న చిత్రమే 'కల్కి 2'. నాగ్ అశ్విన్ కొంతకాలంగా ఈ సినిమా పూర్వ నిర్మాణ పనుల్ని చేస్తూ వస్తున్నారు. వచ్చే నెలలోనే ప్రారంభం కానున్న ఈ సినిమాకీ ప్రభాస్ కొన్ని రోజులు డేట్స్ కేటాయించినట్టు తెలుస్తోంది. అంటే... మళ్లీ మూడు సినిమాల్ని ఒకేసారి ముందుకు నడిపిస్తారన్నమాట. 'ది రాజాసాబ్' ఫలితాన్ని దృష్టిలో పెట్టుకుని వీలైనంత త్వరగా ఆయన కొత్త సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలనే ఉద్దేశంలో ఉన్నట్టు తెలుస్తోంది. నిజానికి ఒక సినిమా పూర్తయ్యాక మరొక సినిమా అనే పద్ధతికి ఎప్పుడో ఫుల్‌స్టాప్ పెట్టేశారు ప్రభాస్. ఆయన కొంతకాలంగా ఒకేసారి రెండు, మూడు చొప్పున సినిమాల్ని ముందుకు నడిపిస్తున్నారు. 'ది రాజాసాబ్' సినిమాతో బిజీగా ఉన్న సమయంలోనే, 'కల్కి 2898 ఎ.డి', 'ఫౌజీ' సినిమాల్నీ చేశారు. దేశవ్యాప్తంగా బలమైన మార్కెట్ ఉన్న ఆయన కోసం పలు కథలు సిద్ధం అవుతున్నాయి. అన్నీ కూడా పాన్ ఇండియా స్థాయిలో, భారీ హంగులతో రూపొందుతున్న కథలే. ఏడాదికి రెండు సినిమాల్నైనా ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలనే లక్ష్యంతో ఆయన ఆయా ప్రాజెక్టుల్ని వెంట వెంటనే పట్టాలెక్కిస్తూ వాటి కోసం డేట్లు కేటాయిస్తున్నారు.






# యుఫోరియాతో విజయం సాధిస్తా..

**- గుణశేఖర్**

కొన్ని సంవత్సరాలు సినిమాలకు దూరంగా విలువైన సమయాన్ని వృథా చేశానని దర్శకుడు గుణశేఖర్ చెప్పారు. కానీ, ఇప్పుడు పూర్తిగా దృష్టిసారించినట్లు తెలిపారు. ఇకపై ఎలాంటి విరామం లేకుండా నిరంతరం సినిమాలు చేస్తానని, బలమైన కంటెంట్‌తో ప్రేక్షకుల ముందుకు రావడమే తన లక్ష్యమని వెల్లడించారు. ప్రస్తుతం ఆయన యుఫోరియా సినిమాతో ముందుకు వచ్చారు. ప్రేమ కథలనైనా, దేశభక్తి చిత్రాలైనా, చారిత్రక సినిమాలనైనా తనదైన శైలిలో తెరకెక్కించగల దర్శకుడు గుణశేఖర్. ఇప్పుడాయన 'యుఫోరియా'తో పలకరించేందుకు సిద్ధమయ్యారు. ఈ సినిమా ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన తన కెరీర్ గురించి మాట్లాడారు. కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేదని 'యుఫోరియా'తో హిట్‌ను సొంతం చేసుకుంటానన్న నమ్మకం ఉందన్నారు. గతంతో పోలిస్తే తన అనుభవం, ఆలోచనా విధానం ఇప్పుడు మరింత ఉన్నతస్థాయికి చేరాయన్నారు. రాబోయే ప్రాజెక్టులు మరింత ప్రత్యేకంగా ఉంటాయని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. 1992లో ఇండస్ట్రీకి వచ్చిన గుణశేఖర్ వరుస సినిమాలతో అలరించారు. 2015లో 'రుద్రమదేవి' తర్వాత 8 సంవత్సరాలు విరామం తీసుకున్నారు. తర్వాత 2023లో సమంతతో 'శాకుంతలం' తీశారు. అది కూడా అనుకున్నస్థాయిలో విజయం సాధించలేదు.




ఇప్పుడు మూడేళ్ల తర్వాత 'యుఫోరియా' అనే కొత్త కాన్సెప్ట్‌తో ప్రేక్షకులను పలకరించనున్నారు. నేటి యువతకు, కుటుంబ ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే వైవిధ్యమైన కథతో రూపొందిన చిత్రమిదని ఆయన తెలిపారు. భూమిక, సారా అర్జున్, నాజర్, రోహిత్, విఘ్నేశ్ గవిరెడ్డి ప్రధాన పాత్రలు పోషించారు.

# హైప్ క్రియేట్ చేసినా.. ప్రేక్షకులు ఆదరిస్తారా అన్నదే ముఖ్యం

## సినిమాల తీరుపై నటుడు విజయ్ సేతుపతి కామెంట్స్

తెలుగు, తమిళంతోపాటు పాన్ ఇండియా ఇమేజ్ ఉన్న యాక్టర్లలో టాప్‌లో ఉంటాడు కోలీవుడ్ యాక్టర్ విజయ్ సేతుపతి. ప్రస్తుతం అరవింద్ స్వామితో కలిసి గాంధీ టాక్స్ సినిమాలో నటిస్తున్నాడు. సాదాసీదా నటనతో ప్రేక్షకులను కట్టిపడేయడం ఈ టాలెంటెడ్ నటుడి స్పెషాలిటీ అని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు షేర్ చేసుకున్నాడు మక్కళ్ సెల్వన్. ఈ రోజుల్లో చాలా మంది యాక్టర్లు, డైరెక్టర్లు తమ సినిమాలు ప్రేక్షకులను ఆకర్షించేందుకు హైప్ క్రియేట్ చేసేందుకు ఏదో ఒక విషయాన్ని హైలెట్ చేయాలని ప్రయత్నిస్తుంటారని తెలిసిందే. విజయ్ సేతుపతి తన అప్‌కమింగ్ మూకీ సినిమా 'గాంధీ టాక్స్' గురించి మాట్లాడాడు.. డైలాగ్స్ లేకుండా ఎమోషన్స్‌తో ప్రేక్షకులతో దగ్గరయ్యేందుకు రెడీ అవుతున్నారు విజయ్ సేతుపతి, అరవింద్ స్వామి. ప్రేక్షకులకు వినోదం కోసం థియేటర్లకు వస్తారు కాబట్టి ఫిల్మ్‌మేకర్స్ ప్రేక్షకులు అర్థం చేసుకోలేని విధంగా సినిమా తీయొద్దని సూచించాడు విజయ్ సేతుపతి. ఓ వైపు ప్రయోగాలకు వెల్ కమ్ చెబుతూనే.. మరోవైపు ప్రేక్షకులు ప్రత్యేకించి డబ్బులు చెల్లించి సినిమా చూసేందుకు వస్తున్నప్పుడు వారికి ఖర్చు భారమనిపించేలా సినిమా ఉండకూడదని అన్నాడు విజయ్ సేతుపతి. గాంధీ టాక్స్ స్పెషల్ సినిమా ఏం కాదు.. కానీ సరికొత్త సినిమా చూసిన అనుభూతిని మాత్రం తప్పకుండా ఇస్తుందని ధీమా వ్యక్తం చేశాడు. సినిమా సంప్రదాయ ఫార్మాట్ ను ఫాలో అవకపోవడంతో గాంధీ టాక్స్ చిత్రాన్ని ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారో టీం మెంబర్స్ అంతా మొదట ఆందోళన చెందారని.. అయితే దగ్గరి స్నేహితులకు స్పెషల్ స్క్రీనింగ్ వేసిన తర్వాత పాజిటివ్ స్పందన వచ్చిందని.. దాంతో సినిమాపై నమ్మంక పెరిగిందన్నాడు విజయ్ సేతుపతి. అయితే వారిచ్చిన ఫీడ్ బ్యాక్ సినిమా మార్కెట్ కోసం ఉపయోగపడదని కూడా చెప్పాడు. టీం అంతా ముందుగా ఈ చిత్రాన్ని సూపర్ హిట్ అవుతుందని ఆశలు పెట్టుకున్నారు. కానీ వారిప్పుడు సినిమా హిట్టవ్వాలని కోరుకుంటున్నారని చెప్పుకొచ్చాడు.



PUBLISHED BY G.KALPANA AND PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254,MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI ,TELANGANA, EDITOR : G.DAYAKAR REDDY , RNI :TELTEL/2022/83927, PHONE NUMBER 9908293393,040- 45046154